మహబూబ్‌నగర్
నాగర్‌కర్నూల్
జోగులాంబగద్వాల్
నారాయణపేట
వనపర్తి

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
18వ వసంతంలోకి

శనివారం 23 నవంబరు 2024 పేజీలు 8




## బిసి రిజర్వేషన్లు పెంచి

# రాజకీయ అవకాశం ఇవ్వండి

- బిసి కమీషన్ విచారణలో బిసి సంఘాల వినతి
- ప్రభుత్వానికి నివేదిస్తామన్న కమీషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్



**మహబూబ్‌నగర్ బ్యూరో మేజర్‌న్యూస్:** శుక్రవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వెనుకబడిన తరగతుల సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన స్థితిగతులు, వెనుకబాటుతనం, వారికి కల్పించాల్సిన అవకాశాలు తదితర అంశాలపై అధ్యయనం నిమిత్తం మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ బహిరంగ విచారణ చేపట్టింది. ఇందులో భాగంగా వివిధ కుల సంఘాలు, వ్యక్తులు, సంస్థలతో విజ్ఞాపనాలను స్వీకరించిన అనంతరం తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లాకు చెందిన బి.సి.సంఘాలు, వ్యక్తుల నుండి 135 వరకు వినతులు అఫిడవిట్ రిజిష్టర్ చేసుకొన్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చివరి దశకు చేరుకుందని అన్నారు. జంట నగరాలు తప్ప మిగతా జిల్లాల్లో 85 నుండి 90 శాతం సర్వే పూర్తి అయిందని అన్నారు. నిన్నటి వరకు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో మహబూబ్‌నగర్‌లో 94 శాతం, వనపర్తి జిల్లాలో 88 శాతం, నాగర్ కర్నూల్ జిల్లాలో 84.2 శాతం, జోగులాంబ గద్వాలలో 94 శాతం, నారాయణ పేట లో 92.5 శాతం పూర్తి అయిందని తెలిపారు. సేకరించిన సమాచారం ప్రశ్నావళి ఫారంలు భద్రపరచడం జరుగుతుందని తెలిపారు. మహబూబ్ నగర్ శాసన సభ్యులు యెన్నం శ్రీనివాసరెడ్డి, జోగులాంబ గద్వాల శాసన సభ్యులు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఆర్థిక సంస్థ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లు నరసింహ రెడ్డి తదిత రులు వచ్చి కూడా వారి అభిప్రాయాలు సూచనలు చేశారనీ తెలిపారు.

- మహబూబ్‌నగర్ శాసనసభ్యులు మహబూబ్‌నగర్‌కు దూర ప్రాంతాల నుండి విద్యార్థులు వస్తారని, వారికి ఉన్నత చదువులకు హైద్రాబాద్ వెళ్లకుండా హాస్టల్ సౌకర్యం కల్పించాలని, ఒకటే బాలికల హాస్టల్ ఉంది ఇంకా రెండు హాస్టల్‌లు ఏర్పాటు చేయాలని కోరారని, ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లనున్నట్లు ఆయన తెలిపారు. మేదర కులస్తులు చట్ట ప్రకారం వెదురు వృత్తిలో ఉన్న వారికి 2000 వెదురు కర్రలు అంద చేయాలని సూచించారని తెలిపారు. రాష్ట్రంలో 900 ఉర్దూ టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి భర్తీ చేయాలని, గతంలో సర్పంచ్‌లు చేసిన పనులకు బిల్లులు పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలని, ఇందులో అత్యధికంగా బి.సి. సర్పంచ్‌లు ఉన్నారని, మైనార్టీలకు ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నవని, బి.సిలకు ప్రత్యేకంగా మెడికల్, ఇంజినీరింగ్ కళాశాలలు కావాలని, ఈ.డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్‌లు పై తీవ్ర వ్యతిరేకత తెలిపారని, సమీక్షించాలని ప్రభుత్వానికి సిఫారసు చేయాలని సూచించారని తెలిపారు. జాంద్ర కులం వారు చేనేత వృత్తి చేస్తారని,మేర సంఘం మేర పేరుతో గుర్తించాలని, బి.సి.ఈ గ్రూప్ లో సయ్యద్, పఠాన్ వారిని కలపాలని, బి.సి.బి లో ఉన్న దూదేకుల వారిని మైనార్టీ గ్రూప్ లో చేర్చాలని,. బి.సి.లకు దామాషా ప్రకారం రిజర్వేషన్ లు కల్పించాలని, ఉప్పర సంఘం ప్రభుత్వ కాంట్రాక్టులలో 15 శాతం కేటాయించాలని, బి.సి.లపై అత్యాచారాలు,అన్యాయాలకు బి.సి. అత్యాచారాల నిరోధక పరిరక్షణ చట్టం తేవాలని,స్వర్ణ కారుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వినతులు, అభిప్రాయాలు తెలిపారని అన్నారు బెస్త కులాల పేరున నకిలీ కుల సర్టిఫికెట్ లు జారీ అవుతున్నట్లు తెలిపారని,ఈ విషయం పై జిల్లా కలెక్టర్ లు చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు బి.సి.ఫెడరేషన్ ఏర్పాటు చేసినట్లు చైర్మన్ పాలక వర్గాలు ఏర్పాటు చేసినట్లు,కొన్నిటికి ప్రకటించి పాలక వర్గం ఏర్పాటు చేయలేదని, నిధులు కేటాయించాలని వినతులు వచ్చాయని తెలిపారు. కుమ్మరి కులస్తులకు ఉచిత విద్యుత్ సౌకర్యం, క్రిమీ లేయర్ తొలగించాలని డిమాండ్,మైనార్టీ ఫకీర్ సాబ్ లను ఎం.బి.సి.లో చేర్చాలని, బి.సి.కులాలు గ్రూప్ మార్పు చేయాలని, మేదరి బి.సి.నుండి ఎస్.టి.కి, ఉప్పరి బి.సి.డి నుండి ఎస్.టి.కు, వడ్డెర బి.సి. ఏ నుండి ఎస్.టి కి ముదిరాజ్ బి.సి.బి నుండి ఏ కు మార్చాలని కోరినట్లు తెలిపారు. ఉద్యోగాల మార్కెట్‌లో సాంకేతిక పరిజ్ఞానం నైపుణ్యం పెంచుకునేందుకు ఈ కోర్సుల్లో చేరే ఎస్.సి., ఎస్.టి., బి.సి., మైనార్టీ విద్యార్థులకు ప్రతి నెల 5 వేల రూ.లు స్టైఫండ్ ,మార్జిన్ మనీ,బ్యాంక్‌లోన్‌లు అందించాలని కోరారు.బి.సి.ఫెడరేషన్ కార్పొరేషన్ లకు బడ్జెట్ లో కేటాయించిన నిధులు పెంచుతూ తప్పని సరిగా వినియోగించేలా చూడాలని అన్నారు.సంఖ్యాపరంగా తక్కువ ఉన్న వర్గాలకు మేలు జరగాలి అన్నారు. జోగులాంబ గద్వాల శాసన సభ్యులు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గం లో వాల్మీకి,వడ్డెర,ఉప్పర సంఘం ల నుండి వచ్చిన విన్నపాలు కమిషన్ కు అంద చేశారు.బి.సి.కమిషన్ జిల్లాకు రావడం సంతోషం అని,వారికి ధన్య వాదాలు తెలిపారు. రాష్ట్ర మైనార్టీ ఆర్థిక కార్పొరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ బి.సి.జనాభా ననుసరించి దామాషా ప్రకారం విద్యా ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. రిజర్వేషన్ లు పెంచాలి అన్నారు. సయ్యద్,మొఘల్ లు,పఠాన్ లు ఆర్థికంగా వెనుకబడిన వారి ని బి.సి. ఈ కేటగిరి లో చేర్చాలని అన్నారు. ఎస్.ఎఫ్. ఐ జిల్లా అధ్యక్షులు ప్రశాంత్ మాట్లాడుతూ జిల్లాలో ఒకటే బాలికల కళాశాల ఉందని,450 నుండి 500 మంది ఉంటే హాస్టల్ లో 150 నుండి 200 మంది కి కెపాసిటీ మాత్రమే వుందని,భవనం

మిగతా 2లో

## దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం పెంపొందించేందుకే క్రీడా పోటీలు

### - జిల్లా అదనపు కలెక్టర్ నరసింగ రావు



**గద్వాల ప్రతినిధి, మేజర్ న్యూస్:** దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం పెంపొందించెందుకే క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ నరసింగ రావు అన్నారు. డిసెంబర్ 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని జిల్లాలో మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లు, ట్రాన్స్ జెండర్లు సాధికారత శాఖ ఆధ్వర్యంలో ఇండోర్ స్టేడియంలో దివ్యాంగులకు రన్నింగ్, ఫుట్ బాల్, క్యారమ్స్, చెస్, ట్రై సైకిల్స్ వంటి క్రీడల పోటీలు నిర్వహించడం జరిగిందని ఇట్టి ఆటల పోటీలను ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ జెండాఊపి క్రీడలను ప్రారంభించినారు. క్రీడలను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ప్రతి సంవత్సరం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. వైకల్యం ఉన్న వ్యక్తులు సరికొత్త ఆవిష్కరణలు రికార్డులు సృష్టించగలిగారని ఇంకా సృష్టిస్తున్నారు, కావున వారికి కావాల్సింది మేమున్నాం అనే భరోసా ఇవ్వాలని ఈ సందర్భంగా తెలియజేశారు. సమాజంలో వారికంటూ ఒక సుస్థిరమైన ప్రత్యేక స్థానం కల్పిస్తూ, వారిని చైతన్య వంతులు చేసేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారిని సుధారాణి, డివైఎస్ఓ ఆనంద్, దివ్యాంగుల సంఘాల సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాధాన్యత కలిగిన రంగాలకు అధిక మొత్తంలో

# రుణాలు మంజూరు చేయాలి

### - నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్




**నారాయణపేట జిల్లా ప్రతినిధి మేజర్‌న్యూస్:** ప్రాధాన్యత కలిగిన వ్యవసాయ, ఎం.ఎస్.ఎం. ఈ. రంగాలకు అధిక మొత్తంలో రుణాలు మంజూరు చేసి జిల్లా అభివృద్ధికి బ్యాంకర్లు సహకరించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్లోని వీసీ హాల్‌లో ఏర్పాటు చేసిన డిసిసి సమావేశానికి చైర్మన్ గా జిల్లా కలెక్టర్, కో కన్వీనర్ గా లీడ్ బ్యాంక్ మేనేజర్ విజయ్ కుమార్ వ్యవహరించారు. ఈ సమావేశంలో వార్షిక ప్రణాళికా సంబంధించిన 2024%-%25 సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసానికి 1359.11 కోట్లతో త్రైమాసిక వృద్ధి ఇది వార్షిక ప్రణాళికలో 41.59 శాతం . మరియు ఎస్. ఎం .ఈ సెగ్మెంట్ సంబందించి 96.66 కోట్లతో 38 .41 శాతం ప్రగతి , మరియు ప్రా7దాన్యత రంగానికి 1211.01 కోట్లు రుణాలు మంజూరు చేయడం జరిగిందని ఎల్ డి. ఎం విజయ్ కుమార్ వెల్లడించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాదాన్యత రంగాలకు బ్యాంకర్లు అధిక రుణాలు ఇవ్వాలన్నారు. అలాగే ఋణ మాఫీ పొందిన రైతులకు ఈ నెలాఖరిలోగా రెన్యువల్ ప్రక్రియ పూర్తి చేసి రైతులకు ఋణ మాఫీ లబ్ది చేకూర్చే విధంగా బ్యాంకర్లు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్.బి.ఐ నుంచి బి.పల్లవి, నాబార్డు అధికారి షణ్ముఖ చారి , ఎస్.బి. ఐ.ఏజీఎం అనిల్ కుమార్, జిల్లాలోని అన్ని బ్యాంకుల ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొని వివిధ సమస్యలపై చర్చించి తగిన నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశంలో డిఆర్డిఓ మొగులప్ప మాట్లాడుతూ...మహిళా శక్తి పథకం కింద క్యాంటీన్లు, ఆర్టీసీ బస్సులు , సోలోర్ ఎనర్జీ వంటి పథకాలను ప్రోత్స హిస్తున్నామని వారికి బ్యాంకర్లు సహకారం అందించాలని కోరారు. జిఎండిఐసీ మహేష్ మాట్లాడుతూ పి.ఎం. విశ్వకర్మ కింద ట్రైనింగ్ తీసుకున్న లబ్ధిదారులకు బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సూర్య
www.suryaa.com
శనివారం
23 నవంబరు 2024

## యాదవుల కామన్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధుల సేకరణ



**కొత్తకోట మేజర్ న్యూస్:** యాదవుల కులదైవం శ్రీకృష్ణ పరంధాముని ఆలయ అభివృద్ధిలో భాగంగా కామన్ కమ్యూనిటీ హాల్ నిర్మాణ నిధుల సేకరణకు రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ ను కొత్తకోట యాదవ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసికామన్‌ఆల్ నిర్మాణానికి సహకరించాలని కోరారు. అందుకనే సానుకూలంగా స్పందిస్తూ నిధుల మంజూరుకి కృషి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. మాజీ వార్డ్ నెంబర్ ఎం బాలకొండ యాదవ్, మాజీ పట్టణ అధ్యక్షులు సాయిల్ యాదవ్, మండల నాయకులు సాయిరాం యాదవ్, మాజీ కురుమూర్తి పాలకమండల సభ్యులు శంకర్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు రాముల యాదవ్ , మందపురం లక్ష్మయ్య యాదవ్, మాజీ మార్కెట్ డైరెక్టర్ దేశ్ పెంటన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## 86 మంది పిల్లలకు ఉచిత స్క్రీనింగ్



**గద్వాల ప్రతినిధి, మేజర్ న్యూస్:** హృదయ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఉచిత చిన్నపిల్లల గుండె వ్యాధుల వైద్య శిబిరాన్ని నిర్వహించి 86 మంది పిల్లలకు స్క్రీనింగ్ చేయడం జరిగిందని జిల్లా వైద్యశాఖ అధికారి సిద్ధప్ప ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం హృదయ ఫౌండేషన్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో గద్వాల పట్టణంలోని దూద్ దవాఖానాలో 0 నుండి 16 సంవత్సరాల గుండె సంబంధిత వ్యాధులకు నిర్వహించిన వైద్య శిబిరంలో 86 మంది పిల్లలకు స్క్రీనింగ్ చేయగా గుండె వ్యాధుల సమస్యలతో బాధపడుతున్న 30 మంది పిల్లలను గుర్తించినట్లు అయన తెలిపారు. ఇందులో 05 మందికి శాస్త్ర చికిత్సలు చేయాల్సిన అవసరం ఉందని, మిగిలిన 25 మందికి సాధారణ వైద్య సేవలు అందిస్తే వారి ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు.

## ప్రజా పాలన పై కళాజాతా ప్రదర్శన



**చిన్నచింతకుంట మేజర్ న్యూస్ :** ప్రజా పాలన ప్రజా విజయోత్సవంలో భాగంగా చిన్నచింతకుంట మండలంలో లాల్కోట బండర్‌పల్లి చిన్నచింతకుంట గ్రామాల లో శుక్రవారం ప్రజా పాలన కళాయాత్ర నిర్వహించడం జరిగింది ప్రభుత్వం వచ్చేనెల 7,వ తారీఖు వరకు సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజాపాలన కళాయాత్ర మహబూబ్నగర్ జిల్లా అన్ని మండల కేంద్రాల్లో నిర్వహిస్తూ చిన్నచింతకుంట మండలంలో కళాకారుల ఆటపాటలతో ప్రభుత్వం అమలు చేస్తున్న 6 గ్యారంటీల పైన వివిధ సంక్షేమ పథకాల పైన తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు ప్రజలకు అర్థమైయేటట్టుగా వివరించడం జరిగింది. ఎంపీడీవో, సుధాకర్ రెడ్డి,గ్రామ పంచాయతి కార్యదర్శి సంతోష్ కళాకారులు 1 టీమ్ లీడర్ విజయ్ కాంత్ కే ఉదయ్ కుమార్. బైండ్ల లక్ష్మణ్ జయప్రకాష్ ఫ్రాంక్లిన్ అశోకచరి,మల్లమ్మ, సంతోష ,పద్మ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్ శేఖర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి జి.ప్రతాప్ గ్రామపంచాయతీ సిబ్బంది, మండల ప్రజలు పాల్గొనడం జరిగింది,

## 23.24 తేదీలలో స్పెషల్ క్యాంపయినింగ్ డే

**కల్వకుర్తి మేజర్ న్యూస్:** కల్వకుర్తి 083 నియోజకవర్గంలోని 271 పోలింగ్ స్టేషన్ లలో ఈనెల 23, 24 తేదీలలో స్పెషల్ క్యాంపయినింగ్ డే నిర్వహించడం జరుగుతుందని ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, ఆర్డిఓ శ్రీను నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజులపాటు పోలింగ్ స్టేషన్ లలో బూత్ లెవెల్ ఆఫీసర్లు అందుబాటులో ఉంటారని ఏ ఆర్ ఓ పేర్కొన్నారు, ఓటర్ వివరాల్లో ఏవైనా సవరణలు ఉంటే సరి చేసుకోవాలని సూచించారు, అదేవిధంగా 1,1,2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులు ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని విఆర్ఓ, ఆర్డిఓ శ్రీను నాయక్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## రాజకీయ అవకాశం ఇవ్వండి

(మొదటిపేజీ తరువాయి)



కూలిపోయే ప్రమాదం ఉందని,రెండు ప్రైవేట్ భవనాలు చూసారని తెలిసిందనీ,ప్రైవేట్ భవనంకు షిఫ్ట్ చేయాలని అన్నారు. బి.సి కమిషన్ సభ్యులు జయప్రకాష్ మాట్లాడుతూ బహిరంగ విచారణలో అనేక సమస్యలు,విషయాలు వ్యక్తం చేశారనీ,సర్వే ద్వారా సేకరించిన సమాచారం లోతుగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇస్తాం అన్నారు. సభ్యులు టి.సురేందర్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా సామాజిక, విద్య, ఆర్థిక, ఉపాధి విషయాలపై స్థితి గతులపై సమాచారం సేకరించడం జరుగుతుందని అన్నారు. సభ్యురాలు రంగు బాల లక్ష్మి మాట్లాడుతూ బహిరంగ విచారణకు సహకరించిన జిల్లా కలెక్టర్లు, అధికారులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.బహిరంగ విచారణ మహబూబ్ నగర్ 9 వ జిల్లా అన్నారు దేశంలో కూడా సర్వే చేపట్టాలని డిమాండ్ వస్తోందని అన్నారు.ప్రజలు అపోహలు పక్కన పెట్టి సమాచారం అందించాలి అన్నారు. ఉదయం బహిరంగ విచారణ ప్రారంభానికి ముందు మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ బీసీ కమిషన్ బహిరంగ విచారణకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందని, ప్రత్యేకించి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల వారీగా కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్,వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి లు మాట్లాడుతూ బీసీ కమిషన్ ప్రజల వద్దకు వెళ్లి బిసిల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని వారి అభ్యున్నతికి కృషి చేయడం సంతోషం అన్నారు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్,రెవెన్యూ అదనపుకలెక్టర్ మోహన్ రావు,గద్వాల రెవెన్యూ అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణలు, మహబూబ్‌నగర్ జిల్లా బి.సి.సంక్షేమ అధికారిణి ఇందిర, నాగర్ కర్నూల్ జిల్లా బి.సి.సంక్షేమ అధికారి ఖాజా నజీమ్ అలీ,వనపర్తి బి.సి.సంక్షేమ శాఖ అధికారి సుబ్బా రెడ్డి,గద్వాల బి.సి.సంక్షేమశాఖ అధికారి రమేష్ బాబు,అర్.డి. ఓ నారాయణ పేట రాం చంద్ర నాయక్,బి.సి.సంక్షేమ శాఖ అధికారి ఖలీల్‌లతో పాటు ,వివిధ శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత అర్ బి అతిథి గృహంలో చైర్మన్ జి.నిరంజన్,సభ్యులు రాపోలు జయ ప్రకాష్,తిరునగరి సురేందర్ ,రంగు బాల లక్ష్మి లకు జిల్లా కలెక్టర్ వి జయేందిర బోయి, ఎస్.పి.డి.జానకి, అదనపు కలెక్టర్ లు పుష్ప గుచ్ఛం అంద చేసి స్వాగతం పలికారు.

## వికలాంగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ధర్నా



**పాలమూరు మేజర్ న్యూస్:** వికలాంగులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని కోరుతూ వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శుక్రవారం తెలంగాణ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు నరేందర్, రాంబాబు శంకర్ యాదవ్ మాట్లాడుతూ వికలాంగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే ఈనెల 26న వీహెచ్పీఎస్ ఆధ్వర్యంలో పెన్షన్ దారుల మహాధర్నా నిర్వహిస్తామన్నారు. దివ్యాంగులకు 6000 పెంచనివ్వాలని వృద్ధులు వితంతు వులకు 4000 పెన్షన్ ఇవ్వాలని కండరాల క్షీణత ఉన్నవారికి 15000 ఇవ్వాలని, ప్రతినెల 5వ తేదీలోపు పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వికలాంగుల బ్యాక్లాగ్ పోస్టులు ఉద్యోగాలు భర్తీ చేయాలని నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించాలని, 2016 వికలాంగుల హక్కుల చట్టం పూర్తిస్థాయిలో అమలు చేయాలని, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలని, జీవో 39 రద్దు చేయాలని, చదువుతో సంబంధం లేకుండా వికలాంగులందరికీ మోటర్ వాహనాలు బధిరులకు మొబైల్ ఫోన్స్ అందులోకి లాప్టాప్ లు కుష్టి వ్యాధిగ్రస్తులకు చెప్పులు వికలాంగుల సహకార సంస్థ ద్వారా అందించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, జైపాల్ రెడ్డి, అందే రాంబాబు, శంకర్ మాధవ్, బుచ్చయ్య నాయక్,విజయ భాస్కర్ రెడ్డి, పారిజాత,సుజాత,రజిత, గోపయ్య పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండ : ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే ,ఎంపీకి కృతజ్ఞతలు







**తెలకపల్లి మేజర్ న్యూస్ :** మండల కేంద్రానికి చెందిన దండు లక్ష్మణ్ అనే బాలుడు 26 -05-2024 న వ్యవసాయ పొలానికి వెళ్లగా సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం ప్రారంభమై పిడుగు పడి బాలుడు లక్ష్మణ్ అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ కూచుకుల్ల దామోదర్ రెడ్డి, నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి లు బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వారు కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ ప్రకారం బాధిత కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వంతో 6 లక్షల రూపాయలు మంజూరు చేయించినట్లు శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు దండు వెంకటయ్య దండు నరసమ్మ శుక్రవారం ఎమ్మెల్సీ, ఎంపీ, ఎమ్మెల్యే ని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ మామిళ్ళపల్లి యాదయ్య, మాజీ ఎంపీపీ బండ పర్వతాలు, రిటైర్డ్ ఉపాధ్యాయులు కె పర్వతాలు, వాటర్ లక్ష్మణ్, ఎండి ఫరీద్, కుమ్మరి బాలస్వామి, ఎండి జిలాని బాబా తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య పరిరక్షణలో ఫార్మసిస్టుల దే ముఖ్య భూమిక

**- ఫార్మా రంగం దినదినాభివృద్ధి చెందుతుంది**

**- 63వ జాతీయ ఫార్మసి వారోత్సవాలు -2024 వేడుకలలో పియు ఉపకులపతి ఆచార్య జి ఎన్ శ్రీనివాస్**




**మహబూబ్‌నగర్ పియు మేజర్‌న్యూస్:** శుక్రవారం పాలమూరు యూనివర్సిటీలో కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ఆడిటోరియంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో 63వ జాతీయ ఫార్మసి వారోత్సవాలు 2024 వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఆచార్య జిఎన్ శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ, ఆరోగ్య పరిరక్షణలో ఫార్మసిస్టులు ఎనలేని కృషి చేస్తున్నారని, ఫార్మా రంగం దినదినాభివృద్ధి చెందుతుందని, ఫార్మసి పూర్తిచేసిన విద్యార్థులకు భవిష్యత్తులో మంచి అవకాశాలు ఉంటాయని, ఫార్మసిస్ట్ లు డాక్టర్స్ చేతిరాతను అర్థం చేసుకునే నైపుణ్యం కలిగి ఉంటారని అన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య చెన్నప్ప మాట్లాడుతూ ,దేశ ఆర్థిక అభివృద్ధిలో ఫార్మారంగం కృషి మరువలేనిదని, భారతదేశంలో తెలంగాణలో ఉన్న రెడ్డిస్ లేబరేటరీ ఎన్నో కొత్త మందులను కనుగొన్నదని అన్నారు. ముఖ్య వక్త కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులకు అకుంఠిత దీక్ష ఉండాలని, పేషెంట్స్ పట్ల ఓపికతో వ్యవహరించాలని, ఒక లక్ష్యం ఏర్పరచుకొని కష్ట పడాలని, పని పట్ల నిబద్ధత ఉండాలని,డాక్టర్స్ కు పేషెంట్స్ కు మధ్య అనుసంధానంగా ఉంటూ ఫార్మసిస్టులు వైద్యరంగంలో ముఖ్య భూమిక వహించాలని, ఫార్మసీ విద్యార్థులు నైపుణ్యాలు అందిపుచ్చుకోవాలని, ఫార్మసీ కాలేజ్‌తో త్వరలో రెడ్డీస్ ల్యాబ్‌తో ఎంఓయు కుదుర్చుకుంటామని అన్నారు. కార్యక్రమంలో చైర్ పర్సన్ డాక్టర్ నూర్జహాన్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ కే ప్రవీణ, విభాగ కన్వీనర్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి, డాక్టర్ రవికుమార్, అధ్యాపకులు డా చిన్నా దేవి,డా రవికాంత్, సోమేశ్ డా శిలాస్ డా. సురేష్ డా ఈశ్వర్, తరుణ్, స్వాతి, శారద,డా సుజాత సరిత తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు యన్మన్ గండ్ల విద్యార్థులు



**నవాబుపేట్ మేజర్ న్యూస్:** మండల పరిధిలోని యన్మన్ గండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు శివకుమార్, రాఘవేందర్‌లు జూనియర్ సాఫ్ట్ బాల్ విభాగంలోనూ, 7వ తరగతి విద్యార్థి రగ్బి అండర్14 విభాగంలోనూ, నిన్న శుక్రవారం మహబూబ్ నగర్ జిల్లా స్టేడియంలో జరిగిన పోటీలలో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వనజ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు, ప్రధానోపాధ్యాయులు పిఈటీ మేరీపుష్ప, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, గ్రామ నాయకులు అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## ఆర్ఎస్పి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు



**వెల్దండ, మేజర్‌న్యూస్.** ఆర్ఎస్పి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని పలు పాఠశాల విద్యార్థులకు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ జన్మదినోత్సవ సందర్భంగా బిఆర్ఎస్ యువ నాయకులు పోలే అశోక్. దొబ్బల భాస్కర్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు జరుగుతున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చేతులమీదుగా బహుమతులను ప్రధానం చేయనున్నట్లు వారు తెలిపారు ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీధర్. ఉపాధ్యాయురాలు స్వాతి. పిఈటి రవీందర్ తదితరులు పాల్గొన్నారు

## పేట కలెక్టర్ కార్యాలయ అవినీతి,అక్రమాలపై ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ రాస్తాం!

**- లైసెన్సు లేని సర్వేయర్లకు ప్రభుత్వ సర్వే పోస్టింగ్ ఎట్లా ఇస్తరు?**

**- బీఎస్పీ జిల్లా అధ్యక్షులు బొదిగెలి శ్రీనివాస్**



**మరికల్ మేజర్ న్యూస్:** మరికల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా బీఎస్పీ అధ్యక్షుడు బొదిగెలి శ్రీనివాస్ మాట్లాడుతూ రెవెన్యూ, సర్వే అధికారుల అవినీతి అక్రమాలతో పేద ప్రజల భూ సమస్యలు ధరణి సమస్యలు పరిష్కారం కాక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నా జిల్లా యంత్రాంగం పూర్తిగా అలసత్వం వహిస్తుందన్నారు. అవినీతికి అలవాటు పడిన అధికారుల తీరు ఇంకా మారలేదని ఇందుకు నిదర్శనం నిబంధనలకు విరుద్ధంగా జరిగిన సర్వేయర్ల బదిలీలే అన్నారు. లైసెన్సు లేని సర్వేయర్లకు ప్రభుత్వ సర్వే పనులు ఎట్లా అప్పగిస్తారని ప్రశ్నించారు. పేద ప్రజలు నిత్యం కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరిగినా సమస్యలకు మోక్షం దొరకడం లేదన్నారు. కలెక్టర్ కార్యాలయ అవినీతి అక్రమాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అన్ని ఆధారాలతో లేఖ రాస్తానని బీఎస్పీ జిల్లా అధ్యక్షులు తెలిపారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**- మున్సిపల్ వైస్ చైర్మన్ నందు**



**నారాయణపేట జిల్లా ప్రతినిధి మేజర్ న్యూస్ :** ప్రజల కోసం అమలు చేసే ప్రభుత్వ పతకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలనీ నారాయణపేట మున్సిపల్ వైస్‌చైర్మన్ నందు నామాజీ అన్నారు. అనారోగ్యంతో చికిత్స పొందిన నారాయణపేట పట్టణం బురుడివాడికి చెందిన జ్యోతిలక్ష్మికి శుక్రవారం సిఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరు అయిన 18 వేల చెక్కును నందు నామాజీ అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో చికిత్స పొందినందున సిఎం రిలీఫ్ ఫండ్ కింద కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి సహకారంతో మంజూరు అయ్యాయని నందు నామా జి తెలిపారు.పేద వ్యక్తికి సిఎం రిలీఫ్ ఫండ్ కింద ఆర్థిక సహాయం అందించిన మంత్రి కిషన్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ పతకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అద్యక్షుడు మిర్చి వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి అపిరెడ్డిపల్లి రాము, కౌన్సిలర్ రాఘవేంద్ర, హన్మంతురావు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికల కొరకు ఎదురుచూపు

**- "సర్పంచ్ పదవి"కీలకం అన్నీ గ్రామలల్లో యువకులలో ఆసక్తి చూపుతున్న వైనం**

**- పంచాయతీ' ఎన్నికలకు సర్కారు కసరత్తు - జనవరిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు!**

**- ఆ లోపే ఆసరా పెంపు, రైతు భరోసా అమలు - కులగణన ఆధారంగా రిజర్వేషన్లు**

**- స్థానిక సంస్థల్లో పాగాయే లక్ష్యంగా యాక్షన్ ప్లాన్**



**మిడ్జిల్ మేజర్‌న్యూస్ :**తెలంగాణ రాష్టంలో ఎప్పుడపుడు అంటున్న పంచాయతీ ఎన్నికలను జనవరిలో నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఆ లోపు ఆరు గ్యారెంటీల్లో భాగంగా హామీ ఇచ్చిన ఆసరా పింఛన్లను రూ.4 వేలకు పెంచాలని భా విస్తోంది. అదే విధంగా రైతు భరోసాను కర్షకుల ఖాతాల్లో జమ చేయనుందని తెలుస్తోంది. ఈనెల 6 నుంచి ప్రారంభమైన కులగణ ఈ నెల 30తో ముగియనుంది. ఆ రిపోర్ట్ ఆధారంగా స్థానిక ఎన్నికల రిజర్వేషన్లను ఖరారు చేసి స్థానిక ఎన్ని కలను నిర్వహించనుంది. గ్రామాల్లో భూ వివాదాలకు కారణమైన ధరణి నిర్వ హణ బాధ్యతను కూడా ప్రభుత్వం కేంద్ర సర్కారు సంస్థ ఎన్ ఐసీకి అప్పగించింది. త్వరలో కొత్త ఆర్వోఆర్ చట్టాన్ని అమలు చేయనుంది. ఈ మేరకు డిసెంబర్ 9 నుంచి ప్రారంభమయ్యే శీతాకాల సమావేశాల్లో ఈ బిల్లుకు అమోదం తెలుపనుంది. స్థానిక సంస్థల్లో పాగా వేసి రాష్ట్రంలో బలమైన శక్తిగా ఎదగాలని ప్రభుత్వం భా విస్తోంది. ఇటీవల వరంగల్ లో జరిగిన సభలోనూ సీఎం రేవంత్ రెడ్డి ఇదే విష యాన్ని చెప్పారు. స్థానిక సంస్థల్లో పాగా వేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతా మని తెలిపారు. డిసెంబర్ చివరివారంలో షెడ్యూల్ విడుదలవుతుందనే చర్చ సాగుతోంది. అయితే జనవరి మొదటి వారంలో నోటిఫికేషన్ ఇచ్చి సంక్రాంతి తర్వాత ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందని సమాచారం. మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తారని తెలుస్తోంది. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం వరకు పోలింగ్ నిర్వ హించి.. అదే రోజు రాత్రి కల్లా ఫలితాలను ప్రకటించే అవకాశం ఉంది.

## ఉపకార వేతనాలపై 25న సమీక్ష సమావేశం : జిల్లా అధికారి ఉమాపతి

**నారాయణపేట జిల్లా ప్రతినిధి మేజర్ న్యూస్ :** షెడ్యూల్డ్ కులాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు 2024-25సం.గాను జిల్లాలోని వివిధ కళాశాలలలో విద్యనభ్యసిస్తున్న వారికి ప్రభుత్వం చెల్లించే ఉపకార వేతనాల మంజూరు పై ఈ నెల 25న సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ సంక్షేమ అధికారి ఉమాపతి తెలిపారు. స్థానిక సిఎన్ఆర్ మెమోరియల్ డిగ్రీ కళాశాలలో జరిగే సమావేశానికి జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్ హాజరవుతారని తెలిపారు. ఉపకార వేతనాల దరఖాస్తు విధానం ప్రభుత్వఆదేశాల మేరకుమొదటి దశలో డెమోగ్రాఫిక్ మ్యాపింగ్, రెండోదశలో బయోమెట్రిక్ అదెంటికేషన్ ఉంటుందని తెలిపారు. మూడోదశలో దరఖాస్తు పూర్తి చేయాలి. డి-స్కాలర్స్ కాలేజీ అనుబంధ హాస్టళ్ళ విద్యార్థులు సైతం ఇదేతరహాలో పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. డెమోగ్రాఫిక్ అథెంటికేషన్, కోసం విద్యార్థి ఆధార్ లోని పేరు, పదోతరగతి ధృవీకరణ పత్రం లో పేరు సరిపోవాలి. టెన్త్ క్లాస్ హాల్ టికెట్ నంబర్, పుట్టిన తేది, ఉత్తీర్ణత సాధించినఏడాది, రెగ్యులర్/ ప్రైవేట్ వివరాలు నమోదు చేయాలనీ తెలిపారు. విద్యార్థి పేరు, తండ్రి పేరు, పుట్టిన తేది కనిపిస్తాయి, స్టూడెంట్ జెండర్, కులం, ఉపకులం ఆధార్ నంబర్ మొబైల్ నంబర్ చదువుతున్న యూనివర్సిటీ / బోర్డ్, కళాశాల పేరు, ఊరు, నమోదు చేసి సబ్మిట్ చేయాలి అనతరం డెమో గ్రాఫిక్ ధృవీకరణ ఫెయిల్ ఐతే దాని ప్రకారం ఆధార్ లో మార్పులు చేసి ధృవీకరించుకున్న దరఖాస్తు నంబర్ వస్తుందన్నారు. తర్వాత రెండో దశకు ఆ వివరాలతో మీ సేవ కేంద్రానికి వెళ్లి బయో మెట్రిక్ పూర్తైన తర్వాత విద్యార్థి వివరాలు ఈ-పాస్-వెబ్సైట్ లో ధరఖాస్తులు అప్లోడ్ అవుతాయని తెలిపారు.ఈ వివరాలు వివరించేందుకు సమావేశం. నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ , ప్రభుత్వ గుర్తింపు పొందిన జూనియర్, డిగ్రీ కళాశాలల ప్రధానాచా ర్యుల తోసమీక్షసమావేశానికి హాజరు కావాలని కోరారు

## రైతాంగ హక్కుల కోసం నిరంతరం పోరాడుదాం

**- జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్. అల్వాల్ రెడ్డి పిలుపు**

**- ప్రారంభమైన తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జీపు జాత**

**- రైతంగా సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన ఉదృతం చేస్తామని హెచ్చరిక**



**బాలానగర్ మేజర్ న్యూస్:** ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును తాము ఏకపక్షంగా వ్యతిరేకిస్తున్నామని, రైతాంగ హక్కుల కోసం వారికి అండదండగా ఉండాల్సిన సమయం ఆసన్నమైందని జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్. అల్వాల్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం నుండి జడ్చర్ల నియోజకవర్గం వ్యాప్తంగా రైతన్న హక్కుల కోసం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో బాలానగర్ మండలంలో జీపు జాత కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రాజకీయ నాయకుడు రైతులను పొగడడం అనవాయితీగా మారిందని, రైతులు 70% ఉండడమే దానికి కారణమని పేర్కొన్నారు. రైతే రాజు అని, దేశానికి అన్నం పెట్టేవాడు రైతు అని, రైతులేని రాజ్యం లేదని అన్నారు. రైతులు అనేక సమస్యలతో సతమతమవు తున్నారని, రైతులు జీతభత్యాలు లేకుండా బతుకుతున్నారని గుర్తు చేశారు. బ్యాంకులు ఇచ్చే అప్పు కేవలం నాలుగు ఎకరాలకు మాత్రమే పెట్టుబడి రుణంగా ఇస్తారని, ! ఐదవ వైకరానికి ఇవ్వరని, దీంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతులు వ్యవసాయానికి మాత్రం ప్రైవేటు వ్యక్తులపై ఆధారపడి వడ్డీకి అప్పు తెచ్చి వ్యవసాయం చేస్తారని పేర్కొన్నారు. రైతు పంట దెబ్బ తింటే రెండవసారి బ్యాంకులు అప్పు ఇవ్వకపోవడంతో ప్రైవేట్ వ్యక్తులను మళ్ళీ ఆశ్రయించాల్సిన పరిస్థితి దాపురిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరు రైతులను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని, ! న్యాయం చేయడానికి ఎవరు ముందుకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకులు కుదవ పెట్టుకునే లక్ష రూపాయలు మాత్రమే రుణంగా ఇస్తారని, అదే బంగారం కుదరపెట్టుకుంటే మాత్రం 60 శాతంలోన్ ఇస్తారని ఇదెక్కడి న్యాయమని ఆయన ప్రశ్నించారు. ప్రైవేటు వ్యక్తులు భూమిని అమ్మినట్టు రిజిస్ట్రేషన్ చేసి ఇస్తేనే ఎకరాకు రైతులకు ఐదు లక్షల రూపాయలు అప్పు ఇవ్వడానికి ముందుకు వస్తారని, కొన్నిసార్లు రిజిస్ట్రేషన్ చేసుకొని అప్పు ఇవ్వకపోతే పోలీస్ స్టేషన్ కు వెళ్లినా రైతులకు న్యాయం జరగడానికి వీలు లేకుండా పోయిందని తెలిపారు. రైతులకు పోలీసులు న్యాయ సహాయం చేస్తున్నారో, బ్యాంకులు అప్పులు ఇస్తున్నారో లేదో, అలాగే రైతులను మోసం చేసిన వారిపై కోర్టులు శిక్షలు వేస్తున్నాయా లేవు ప్రతి ఒక్కరు గమనించాల్సిన అవసరం ఉందని అన్నారు. రైతులకు తాము అండగా ఉండేందుకే ఇలాంటి జీపు జాత కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, ఇది రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి ఆందోళన కార్యక్రమాలు చేయడానికి తాము ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉంటామని అల్వాల్ రెడ్డి స్పష్టం చేశారు.

## సర్వే వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలి : ఎంపీడీవో ఇసాక్ హుస్సేన్



**చారకొండ, మేజర్ న్యూస్** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలని ఎంపీడీవో ఇసాక్ హుసేన్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులకు, ఉపాధ్యాయులకు, ఎన్ఆర్ఆజీఎస్, ప్రైవేట్ ఆపరేటర్లకు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాలను ఆన్లైన్లో నమోదు చేసేందుకు ఆవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో ఇసాక్ హుసేన్ మాట్లాడుతూ సర్వే వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా ప్రకడ్బందిగా ఆన్లైన్లో నమోదు చేయాలని అన్నారు. సర్వే వివరాలను ఆన్లైన్లో నమోదు చేసేందుకు 55 మంది ఆపరేటర్లను అందుబాటులో ఉంచి ఆన్లైన్ నమోదు చేస్తున్నట్లు ఎంపీడీవో హుస్సేన్ హుసేన్ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ అద్దంకి సునిత, ఎంపీవో వెంకటేష్, ఏఎస్వో విక్రంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అండర్ 14 కో కో రాష్ట్రస్థాయి ఎంపికైన ముసాయిబ్ ఆహ్మాద్

**కోయిలకొండ మేజర్ న్యూస్:** మండల కేంద్రమైన కోయిలకొండ జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి కోకో టోర్నమెంట్లో అత్యంత ప్రతిభ కనబరిచి ఈనెల 23 నుండి 25 వరకు హైదరాబాద్ జిల్లాలోని దోమలగూడలో నిర్వహించే అండర్ 14 కోకో రాష్ట్ర స్థాయి ఎస్ జి ఎఫ్ టోర్నమెంట్ ఎంపికైన ముసాయిబ్ అహ్మద ఎంపిక కావడం జరిగిందని పిటి మొగులాల్ తెలిపారు. అనంతరం ఆ విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటాజీ, ఉపాధ్యాయులు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, స్పోర్ట్స్ ఆడటం వల్ల శారీరక మానసిక ఉత్సాహంగా ఉంటారని విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించినప్పుడే సమాజంలో గుర్తింపు ఉంటుందని ఆయన తెలియజేశారు. ఎంపికైన విద్యార్థిని పలువురు అభినందించారు.

## ఎస్‌జిఎఫ్ జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ అండర్ 14 పోటీలకు జిల్లా క్రీడాకారులు



**మహబూబ్ నగర్ స్పోర్ట్స్ మేజర్ న్యూస్:** ఈనెల 25వ తేదీ నుండి 28వ తేదీ వరకు చత్తీస్గఢ్ రాష్ట్రంలో జరిగే 68వ జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 14 బాల బాలికల హ్యాండ్ బాల్ ఛాంపియన్షిప్ పోటీలలో పాల్గొనే తెలంగాణ రాష్ట్ర స్థాయి జట్టుకు మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని అపెక్స్ పాఠశాల 7వ తరగతి విద్యార్థి పి జయవర్ధన్ రెడ్డి, మహబూబ్ నగర్ హై స్కూల్ 8వ తరగతి పీ లాస్య పిరియా ఎంపికైన సందర్భంగా మహబూబ్ నగర్ జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్ విద్యార్థులను అభినందించారు. జాతీయ స్థాయి పోటీలలో రాణించాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ జిల్లా స్కూల్ గేమ్స్ నిర్వాహక కార్యదర్శి డాక్టర్ శారద భాయ్, వ్యాయామ ఉపాధ్యాయులు వేణుగోపాల్, మహమ్మద్ జియా ఉద్దీన్, మొహమ్మద్ ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు అన్ని రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలి

### - బిసి పొలిటికల్ జెఏసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్



**పాలమూరు మేజర్‌న్యూస్:** సమాజంలో సగభాగాని కన్నా ఎక్కువ ఉన్న బీసీలకు రాజకీయ, విద్య,ఉద్యోగాలు నామినేటెడ్ పదవులు వంటి అన్ని రంగాల్లో బీసీలకు రిజర్వేషన్లు వర్తించేలా కమిషన్ చొరవ తీసుకోవాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగేందర్ గౌడ్ శుక్రవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్లో బీసీ కమిషన్ ప్రతినిధులకు వినతి పత్రం అందించారు. ముఖ్యంగా స్థానిక సంస్థల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. సహకార బ్యాంకు ఎన్నికలలో ఇప్పటివరకు రిజర్వేషన్లు అమలు కాకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఏటా రాష్ట్ర బడ్జెట్లో బీసీల సంక్షేమానికి50శాతం నిధులుకేటాయించాలని, బీసీ సబ్ ప్లాన్ ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి చేశారు. బీసీ, ఎంబీసీ సంచార జాతుల కార్పొరేషన్లకు పదివేల కోట్లు కేటాయించాలని, ఉన్నత విద్య అభ్యసిస్తున్న బీసీ విద్యార్థులకు మొత్తం ఫీజు రీఎంబర్సుమెంట్ అమలు చేయాలని,ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు పున:పరిశీలించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బిసి పొలిటికల్ జెఏసి రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటన్న గౌడ్, మహేందర్ నరసింహ శివశంకర్ పాల్గొన్నారు.

## నాగర్ కర్నూల్ జిల్లా డీఈవో గా ఏ.రమేష్ కుమార్



**నాగర్ కర్నూల్ ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్ :** రాజన్న సిరిసిల్ల జిల్లా విద్యాశాఖ అధికారిగా పనిచేస్తున్న రమేష్ కుమార్ ను నాగర్ కర్నూల్ జిల్లా డీఈవోగా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ పాఠశాల డైరెక్టర్ వెంకట నరసింహారెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. రమేష్ కుమార్ ను నాగర్ కర్నూల్ జిల్లా డీఈవోగా పదవీబాధ్యతలు చేపట్టాలని ఉత్తర్వుల్లో నరసింహారెడ్డి ఆదేశించారు. నాగర్ కర్నూల్ జిల్లా డీఈవోగా ప్రస్తుతం పనిచేస్తున్న డాక్టర్ యం గోవిందరాజులును నారాయణపేట, డీఈవోగా బదిలీ చేస్తూ గద్వాల జిల్లాకు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారు. నాగర్‌కర్నూల్ డీఈఓ గోవిందరాజులు ఫిబ్రవరి 6వ తేదీ 2019 నాటినుండి సుదీర్ఘంగా జిల్లాలో సేవలందించారు. సుదీర్ఘంగా పనిచేసే జిల్లా విద్యాభివృద్ధికి కృషిచేసిన డిఈఓ గోవిందరాజులు పలువురు ప్రధానోపాధ్యాయులు కలిసి అభినందనలు తెలిపారు

# ఆధ్యాత్మికతకు నిలయం వెల్దండ శివుని గుట్ట

### - అభివృద్ధికి ఆమడ దూరంలో ఆలయాలు

### - సొంత ఖర్చులతో ఆలయాల మరమ్మతులు చేపడుతున్న వెల్దండ యువకుడు వెంకటేష్





**వెల్దండ. మేజర్ న్యూస్.** మండల కేంద్ర సమీపంలోని శివుని గుట్టపై వెలసిన శ్రీ పాండు రంగనాయక దేవాలయం, శివాలయం , మైసమ్మ ఆలయం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయానడంలో అతిశక్తి లేదు. ఆధ్యాత్మికతకు నిలయంగా శివుని గుట్టపై కొలువుదీరిన దేవాలయాలకు ధూప దీప నైవేద్యాలు కరువైయాయి. గతంలో అంగరంగ వైభవంగా ఉత్సవాలు జరిగేవని వెల్దండలో నానుడి ఉంది. శివుని గుట్టపై ప్రధానంగా శివాలయం మరమ్మత్తులకు వెల్దండ గ్రామానికి చెందిన మసిగుండ్ల వెంకటేష్ అనే యువకుడు ముందుకు వచ్చి దేవాలయంలో చిన్న చిన్న సిమెంటు పనులతో పాటు టైల్స్ ఏర్పాటు చేశారు . ప్రధానంగా కార్తీక మాసం కావడంతో భక్తులు శివుని గుట్ట పైకి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నట్లు గమనించిన వెంకటేష్ స్థానిక సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్ , వెల్దండ మాజీ సర్పంచ్ భూపతిరెడ్డిలతో కలిసి రోడ్డు మరమాత పనులను చేయడంతో భక్తులకు గుట్టకు వెళ్లేందుకు కొంత మెరుగైన సౌకర్యం ఏర్పడింది. రోడ్డు మార్గంతో పాటు శివుని గుట్ట పై కొంతమేర చదును చేసి భక్తుల సౌకర్యార్థం జెసిబి సహాయంతో శిథిలావస్థలో ఉన్న శ్రీ పాండురంగ దేవాలయ ప్రాంగణం పిచ్చి మొక్కలు ముళ్ళ చెట్లను తొలగించారు. దేవాలయ శాఖ అధికారులు స్పందించి ఆలయాల మరమ్మతుకు నిధులు సమకూరు ఇస్తే నిత్యం భక్తులతో ఉండే ఆలయాలకు మరింత మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని పలువురు గ్రామస్తులు పేర్కొంటున్నారు. దేవాలయం మరమ్మత్తులకు భక్తులు సైతం ముందుకు రావాలని గ్రామస్తులు కోరుతున్నారు.





***అనంత పద్మనాభ స్వామి ఆకారంలో పాండు రంగనాయక స్వామి..*** కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురంలోని శ్రీ అనంత పద్మనాభ స్వామి రూపాన్ని పోలి ఉన్న శ్రీ పాండురంగ స్వామి విగ్రహం ఉండడం ఇక్కడ ప్రత్యేకత.

***గుట్టపై కోనేరు ప్రసిద్ధి..*** శివుని గుట్టపై పెద్దకోనేరు ,చిన్న కోనేరు ఎంతో ప్రసిద్ధి చెందింది. పెద్ద కోనేరులో తామర పూలు పూయడం ఇక్కడ ప్రసిద్ధి. అలాగే చిన్న కోనేరులో ఉమామహేశ్వర పాపగుండం మాదిరిగా మీరు ఎంత తోడితే అంత రావడం ఇక్కడి ప్రత్యేకత.

***గుహలో మైసమ్మ దేవాలయం..*** శివుని గుట్టపై గుహలో మైసమ్మ దేవాలయం ఉంది. మైసమ్మ దేవత విగ్రహం వద్దకు వెళ్లి చూసే వరకు గుహలో అమ్మవారు ఉన్నట్లు తెలవదు. చూడడానికి భయంకరంగా ఉన్నా మైసమ్మ దేవతను కొలిచేందుకు భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు.

***అభివృద్ధి చెందితే.. పర్యాటక కేంద్రంగా శివుని గుట్ట..*** పచ్చని పొలాల మధ్యల ఉన్న శివుని గుట్ట అభివృద్ధి చెందుతే గ్రామీణ ప్రాంతాలలో పర్యాటక ప్రాంతంగా పేరు ప్రసిద్ధి చెందే అవకాశం ఉంది. గుట్టపై శివాలయంతో పాటు, శ్రీ పాండురంగ దేవాలయం, అమ్మవారి దేవాలయం, కోనేరులు ఉండడం ఇక్కడ విశేషం. గుట్ట గుహలో శ్రీ పాండురంగ స్వామి వెలిసినారు. గుట్ట పై గోపురం ఏర్పాటు నాటి పురాతన కట్టడాలకు తార్కారంగా నిలుస్తుంది

## చదువుతోపాటు సంస్కారం ఉండాలని సంస్కారం లేని చదువు వ్యర్థమని విద్యార్థులలో చైతన్యం కల్పించిన జిల్లా జడ్జి గంటా కవితా దేవి



**ధరూర్ మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని ఉప్పేర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉప్పేరు లో జరిగిన మోటివేషనల్ స్పీకర్ గా విచ్చేసి తన స్పీచ్ ద్వారా విద్యార్థులను ప్రభావితం చేసిన జోగులాంబ గద్వాల జిల్లా జడ్జి గంట కవిత దేవి తన అమూల్యమైన సందేశాన్ని ఇచ్చారు.విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు చదువు పట్ల ఆసక్తి అలవరిస్తే వారికి మంచి ఆలోచనలు కలుగుతాయని దానితో సరైన నిర్ణయాలు తీసుకునేందుకు వీలుంటుందని అన్నారు. జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగడానికి లక్ష్యం ధ్యేయం సంకల్ప బలం అనేది ముఖ్యమని ఈనాడు మనం అనుకున్నదే మన జీవితంలో జరిగే విధంగా మనం కృషి చేయాలని విద్యార్థులను ప్రోత్సహించారు. చదువుతోపాటు సంస్కారం ఉండాలని సంస్కారం లేని చదువు వ్యర్థమని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గౌరీ శంకర్ పాల్గొని విద్యార్థుల్ని చైతన్యవంతం చేశారు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్ణయించడం స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది.

## ఐజ మండలంలోని పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేసిన మండల విద్యాధికారి రాములు



**ఐజ మేజర్ న్యూస్ :** జోగులాంబ గద్వాల్ జిల్లాలోని ఐజ మండలంలో పాఠశాల సమయాన్ని పాటించని ప్రభుత్వ ఉపాధ్యాయులు అని మీడియాలో వచ్చిన కథనానికి స్పందించిన మండల విద్యాధికారి ఐజ మండలంలో ఉన్న పాఠశాలలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మిడ్ డే మీల్ స్కీమ్ నిర్వహణ ను ప్రతి రోజు అత్యంత బాధ్యతతో కూడిన వ్యవహారంగా భావించాలి. అని అలాగే ఉపాధ్యాయులు అందరూ మధ్యాహ్న భోజన పథకాన్ని పర్యవేక్షణ చేయాలి. దుమ్ము ధూళి లెని బియ్యం కడిగి భోజనం వండే విదంగా జాగ్రత్త తీసుకోవాలి. కూరగాయలు, ఆకుకూరలు తాజా గా ఉండేట్లు చూసుకోవాలి. బ్యాలు, కారం, నూనే ఇతర సామాగ్రి నాణ్యత కలిగినవి ఉండాలి. పండ్లు తాజాగా ఉండేలా చూసుకోవాలి. ముఖ్యంగా గుడ్లు ఇచ్చే రోజు చెడిపోయిన గుడ్లు కాకుండా మంచి గుడ్లను ఉపయోగించాలి అని ముఖ్యంగా గుడ్లను బాగా ఉడక పెట్టాలి. పరిశుభ్రమైన స్థలము లో భోజనం విద్యార్థులు చేసేలా ఏర్పాటు చేయాలని అన్నారు. సురక్షిత త్రాగునీరు ఏర్పాటు చేయాలి. చేతులు శుభ్రంగా కడుక్కోనే సౌకర్యం ఉండాలి. ఈ మొత్తం వ్యవహారంను ఈ మొత్తం బాధ్యతలను ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు గమనిస్తూ ఉండాలని అన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి ఎంపీడీవో



**కృష్ణ మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని గుడేబల్లూర్ లో ప్రాథమిక పాఠశాల తో పాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మధ్యాహ్న భోజన వంట గదులను శుక్రవారం ఎంపీడీవో జానయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన నిర్వాహకులు వంట చేసే పరిసర ప్రదేశం పరిశుభ్రత పాటించాలన్నారు. వంట గదులో నిల్వ ఉన్న కూరగాయలు, బియ్యాన్ని,ఆహర ధాన్యాల నాణ్యతలు పరిశీలించి, మెనూ ప్రకారం నిత్యం తాజా కూరగాయలతో విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన నాణ్యమైన భోజనం అందించాలన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఎంపీడీవో సూచించారు. పరిశుభ్రత పాటిస్తూ స్వచ్ఛమైన వంట పదార్థాలు వినియోగించి మధ్యాహ్నం భోజనం రుచిగా వండాలని వంట నిర్వాహకులకు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనాని ప్రతిరోజు, ప్రధానోపాధ్యాయులు ,ఉపాధ్యాయులు పరిశీలిస్తూ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. రోజువారీగా అందించే మెనూ రిజిస్టర్లను పరిశీలించి, మండల వ్యాప్తంగా కొనసాగుతున్న సమగ్ర ఇంటింటి కులగణన సర్వే దాదాపు 97శాతం పూర్తయినట్లు ఎంపీడీవో జానయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గణేష్ సింగ్, పంచాయతీ కార్యదర్శి రఘు , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ ఆధ్వర్యంలో 5 లక్షల ప్రమాద బీమా చెక్కు మృతుని కుటుంబానికి అందజేత



**నారాయణ పేట జిల్లా ప్రతి నిధి మేజర్ న్యూస్ :** జీవీకే ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సంస్థ 108 అంబులెన్స్ లో నారాయణపేట జిల్లా అంబులెన్స్ నందు "ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్" గా పనిచేస్తున్న శ్రీనివాస్ గత మార్చ్ 5 2024 వ తారీఖున రోడ్డు ప్రమాదంలో మరణించడం జరిగింది. ఈరోజు హైదరాబాద్ సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎంఏ ఖలీద్ ఆదేశానుసారంలో హెచ్ఆర్ హెడ్ కిరణ్ కిషోర్ సూచనల ప్రకారం వారి కుటుంబ సభ్యులకు జివికె ఈఎంఆర్ఐ ఆధ్వర్యంలో లో ఐదు లక్షల ప్రమాద బీమా చెక్కును కుటుంబానికి ఈఎంఆర్ఐ సంస్థ అధికారులు తో అందజేయడం జరిగింది. ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ రవికుమార్.ఎగ్జిక్యూటివ్ రాఘవేందర్.ఉదయ్ కుమార్.సిబ్బంది రాజ్ కుమార్ .వెంకటయ్య. భారత్ కుమార్.అంజిళప్ప 108 ఉద్యోగులు పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందించిన మాజీ ఎంపిటిసి



**కోయిలకొండ మెజర్ న్యూస్:** మండలంలో ఉన్న కొత్లాబా ద్ గ్రామపంచాయతీలో గోకుల్ నగరం భీమయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో అంత్యక్రియల కోసం కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం మాజీ ఎంపిటిసి రాజిరెడ్డి అందజేశారు. అనంతరం కుటుంబ సభ్యులని ఓదార్చి పరామర్శించారు. నిరుపేద కుటుంబానికి చెందిన మృతుని కుటుంబ సభ్యులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని ఆయన కోరారు.

## సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన : ఎస్ఐ శంషుద్దీన్



**చారకొండ, మేజర్ న్యూస్ :** సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శంషుద్దీన్ అన్నారు. శుక్రవారం మండలంలోని మర్రిపల్లిలో ఫైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐఐ శంషుద్దీన్ మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నేరాలు అదుపులో ఉంటాయని అన్నారు. గ్రామాల్లో దాతల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవా లని గ్రామస్థులతో అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంగోత్ నరేష్ నాయక్, మాజీ ఉపసర్పంచ్ వ్యాప కేశవరెడ్డి రవిందర్రెడ్డి సుధాకర్రెడ్డి, వెంకటరె డ్డి, రవిందర్రెడ్డి, శేఖర్రెడ్డి, విష్ణువర్ధన్రెడ్డి, వెంకటయ్య, సత్తయ్య, చంద్రయ్య, బాలు, శంకర్, లక్ష్మారెడ్డి, దర్మారెడ్డి, బుచ్చిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి పాల్గన్నారు.

## బోనస్ 500తో వరి పంట పండించిన రైతులలో ఆనంద ఉత్సాహాలు

### - కృతజ్ఞతలు తెలిపిన టీపీసీసీ రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి ఎండీ. అంజాద్ అలీ



**మదనాపురం మేజర్ న్యూస్ :** తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టంగా చేపట్టిన వరి ధాన్యం కొనుగోలు చేసి, ధాన్యం సేకరించిన వారంలోపే రైతుల ఖాతాలలో రూ. 500 బోనస్ నగదు విడుదల చేసి రైతుల జీవితాలలో వెలుగులు నింపినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావుకి, దేవరకద్ర శాసనసభ్యులు జి మధుసూదన్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. ప్రతిపక్షాలు బోనస్ ఇవ్వడం లేదని రైతులను రెచ్చగొట్టే ప్రభుత్వంపై ఆరోపణలు చేసిన వారి నోరు మూపించారు. ఇచ్చిన మాట ప్రకారం రేవంత్ రెడ్డి సన్నాళ్లకు 500 బోనస్ వేశారు వేసినందుకు ముఖ్యమంత్రికి మంత్రికి ఎమ్మెల్యేకి మధునాపురం మండల కాంగ్రెస్ పార్టీ తరపున కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను.

# ఐకెపి సెంటర్లో వడ్ల తూకం తారుమారు చేస్తున్నారు...?

### - చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్న రైతు రామచంద్రా రెడ్డి

### - జిల్లా కలెక్టర్‌కు, ఎమ్మార్వోకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడి

**బాలానగర్ మేజర్ న్యూస్ :** వడ్ల తూకములో ఐకెపి సెంటర్ వాళ్ళు తారుమారు చేస్తున్నారని, రైతులు నష్టపోయే విధంగా వ్యవహరిస్తున్నారని రైతు రామచంద్రారెడ్డి పేర్కొంటున్నారు. ఈనెల 16 రోజున ఐ.కె.పి. సెంటర్ లో వడ్లు కాంటలో 40 కిలోల 700 గ్రాములుగా తూకం చేసి 18వ తేదీన రశీదు ఇచ్చినట్లు తెలిపారు. తరువాత మూడు రోజులకు నాకు బాలానగర్ ఎ.పి.యం. నాగరాజు ఫోన్ చేసి రైస్ మిల్లర్ తూకము 500 కిలోలు తక్కువ ఉన్నదని, అందుకుగాను 500 కిలోల డబ్బులు తక్కువ తీసుకో, లేని యెడల నీ డబ్బులు ఇవ్వము అని నన్ను భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులను మోసము చేసి మిల్లర్కు ఎక్కువ తూకము జోకి ఇస్తున్నారని, చట్టపరంగా 40 కిలోల 700 గ్రామలకు గాను 41 కిలోల 300 గ్రాములు జోకి రైస్ మిల్లర్ల పక్షపాతము వహిస్తున్నారని ఆరోపిస్తున్నారు. తనకు జరిగిన అన్యాయమునకు పైన తెలిపిన అధికారులపై చట్టరీత్య చర్య తీసుకొని తనకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్కు, మండల తాసిల్దార్ కు, వ్యవసాయ శాఖ అధికారికి, సంబంధిత వ్యవసాయ శాఖ మంత్రికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు రైతు రామచంద్ర రెడ్డి శుక్రవారం మీడియాకు తెలిపారు.

## పోలీసుల కీర్తి ప్రతిష్టలు పెంచే రీతిలో ప్రజాసేవకు అంకితం కావాలి : ఎస్పీ యోగేష్ గౌతమ్



**నారాయణపేట జిల్లా ప్రతినిధి మేజర్ న్యూస్ :** శాంతి భద్రత లను పరిరక్షిస్తూ పోలీసుల కీర్తి ప్రతిష్టలు పెంపొందించే దిశగా నిరంతరం కృషి చేయాలని, పోలీస్ శాఖలో ప్రతి ఒక్కరు క్రమశిక్షణతో ఉండి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు.శుక్రవారం నారాయ ణపేట జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ యోగేష్ గౌతమ్ 9 నెలల శిక్షణ పూర్తి చేసుకొని వచ్చిన ట్రైనీ కానిస్టేబుల్ లను కలిసి వారి యొక్క వివరాలు అడిగి తెలుసుకున్నారు అనంతరం ఎస్పీ మాట్లాడుతూ జిల్లా నుండి పోలీస్ శాఖకు ఎంపికైన 78 మందిలో 34 మంది సివిల్ కానిస్టేబుళ్లు,13 మంది సివిల్ మహిళా కానిస్టేబుళ్లు, 26 మంది సాయుధ ధళ కానిస్టేబుళ్లు, 5 మంది సాయుధ ధళ మహిళా కానిస్టేబుళ్లు, వివిద పోలీస్ శిక్షణ కేంద్రాలకు శిక్షణకు వెళ్ళి 9 నెలల కఠినమైన పోలీస్ శిక్షణ పూర్తి చేసుకుని ఈ రోజు జిల్లాకు రావడం జరిగిందని అన్నారు. అందరు నారాయణపేట జిల్లాకు చెందిన వారు ఉండటం వల్ల జిల్లా అభివృద్ధి చెందడానికి దోహదపడుతుందనీ అన్నారు. ఈ జిల్లాకు తెలంగాణ రాష్ట్రా పోలీసు శాఖకు మంచిపేరు తీసుకురావాలని తెలియ జేశారు.ఈ కార్యక్ర మంలో ఎస్బి సిఐ రామ్ లాల్, ఆఫీస్ సూపర్డెంట్ శంకర్ లాల్,ఆర్ ఎస్సై లు శివశంకర్, రాములు, శిక్షణ పొందిన కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

## బిజెపి ఆర్ఎస్ఎస్ మతోన్మాద, విభజన, విద్వేషపు రాజకీయాలతో దేశానికే ప్రమాదం - సిపిఎంఎల్ మాస్ లైన్



**నారాయణపేట టౌన్ మేజర్ న్యూస్:** బిజెపి ఆర్ఎస్ఎస్ మతోన్మాద విభజన, విద్వేషపు రాజకీయాల వల్ల భారతదేశానికే ప్రమాదం వాటిల్లుతోందని సిపిఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ ఎస్ ఎల్ పద్మ విమర్శించారు. శుక్రవారం రోజు జిల్లా కేంద్రంలో ఎస్ ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో సిపిఐఎం, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు ఆమె ముఖ్య వక్తక హాజరై ప్రసంగించారు. ఈ సదస్సుకు సిపిఐ ఎమ్ ఎల్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె కాశీనాథ్ , సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బాల్ రామ్ లు అధ్యక్షత వహించగా సిపిఎం సిపిఐ మాస్ లైన్ జిల్లా నేతలు కామ్రేడ్ సలీం ,కామ్రేడ్ గోపాల్ అంజిలయ్యా గౌడ్ తదితరులు మాట్లాడారు. ఈ సదస్సులో ఇరు పార్టిల నేతలు జోషి,అశోక్,నరహరి,హన్మం మహ్మద్అలీ, షేర్,పవన్, నర్సింహ, కిరణ్, రాము, వెంకట్రాములు, హాజీ తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ హాస్టల్స్‌ను ఆకస్మికంగా తనకి చేసిన అడిషనల్ కలెక్టర్ నర్సింగారావు



**ఐజ మేజర్ న్యూస్ :** జోగులాంబ గద్వాల జిల్లా ఐజ పట్టణ పరిధిలోని ప్రభుత్వ ఎస్సీ,బీసీ హాస్టల్స్ ను జిల్లా అడిషనల్ కలెక్టర్ బి నరసింగరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ స్టడీ హవర్స్ లో ఉన్న విద్యార్థులతో మాట్లాడుతూ సరైన వేలకు భోజనం, తాగునీరు అన్ని సౌకర్యాలు అందిస్తున్నారో లేదా అని అడిగి తెలుసుకున్నారు. వార్డెన్ అన్ని సమయాల్లో అందుబాటులో ఉంటారా, గత కొన్ని రోజుల క్రితం జరిగిన పరిస్థితులు మళ్లీ ఏమైనా జరిగాయా ఎవరైనా తెలియని వ్యక్తులు లోపలికి వస్తే వార్డెన్ కు తెలియజేయాలని అన్నారు. వార్డున్లకు పలు సూచనలు చేసి అన్నివేళలా విద్యార్థులకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం అందిస్తున్న అన్ని సౌకర్యాలను విద్యార్థుల వరకు తీసుకెళ్లాలని అలాగే విద్యార్థులకు ఇచ్చే ఖర్చుల బిల్లులు ఎప్పటికప్పుడు విద్యార్థులకు అందేలా చూసుకోవాలని అన్నారు. అడిషనల్ కలెక్టర్ బి నర్సింగరావు వెంట ఎంపీడీవో , ఫీల్డ్ అసిస్టెంట్ అశోక్ కుమార్ తదితరులు ఉన్నారు.

## మధ్యాహ్న భోజన వంట కార్మికులకు పెండింగ్ బిల్లులు,వేతనాలు వెంటనే చెల్లించాలి

### -మారేడు శివశంకర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి



**నాగర్ కర్నూల్ ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్ :** కామ్రేడ్ లక్ష్మణాచారి భవన్లో మధ్యాహ్న భోజన వర్కర్స్ కార్మికుల సమావేశం ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి, చిన్నపాగ శ్రీనివాసులు అధ్యక్షతన ఏర్పాటుచేశారు. పాఠశాలలలో మధ్యాహ్న భోజన పథకం ద్వారా, వంటలు చేస్తున్న వంట కార్మికులను వివిధ సాకులు చెబుతూ తొలగించే ప్రయత్నాలు అధికారులు నిరోధించాలని అన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ మాట్లాడుతూ ,గత 22 సంవత్సరాలుగా ఎలాంటి ఆధాయం, లేకపోయినా భవిష్యత్తు ఉంటుంది అనే ఆలోచన తో ఇన్నాళ్లు వంటలు చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తూన్నారని పెట్టిన కోడిగుడ్ల పెట్టుబడి బిల్లులు పదినెలలు గా పెండింగ్లో ఉన్నవని అన్నారు. కోడిగుడ్డుకు ప్రభుత్వం రూ 5/-లు చెల్లిస్తుంటే మార్కెట్లో రూ 7/-కు లభిస్తుందని రెండు రూపాయలు నష్టం ఎవరు భరించాలని అడిగారు, వేతనాలు నెలల తరబడి పెండింగ్లో ఉన్నా వంటలు చేస్తున్న వంట కార్మికులను వేతనాలు పెరుగుతున్న సమయం లో ,చేయని తప్పులు చేస్తున్నట్లు ఆరోపణలను చేస్తూ గ్రామాలలలో రాజకీయ, ఇతరత్రా కారణాల వల్ల కొందరు అధికారులు వారికి అనుకూలంగా లేరనే సాకులతో ,అవసరమైతే విద్యార్థులతో మరియు పేరెంట్స్ తో ఫిర్యాదులు చేపిస్తూ తొలగించడానికి ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు, అందుకే వంట కార్మికుల సర్వీసు ధ్రుష్ట్యా, వారి భవిష్యత్తు ధ్రుష్ట్యా, కార్మికులను తొలగించకూడదని అన్నారు.ఇప్పటికే కొన్ని పాఠశాలల్లో,ఈ కార్యక్రమానికి పూనుకున్న అధికారులు స్పందించి, ఏ ఒక్క వంట కార్మికరాలును తొలగించకూడదని కోరారు.అలాగే జిల్లాలోని అన్ని పాఠశాలల వంట కార్మికులు పోరాటాలకు సన్నద్ధం కావలసి ఉంటుంది అన్నారుఈ కార్యక్రమంలో మధ్యాహ్నం భోజన కార్మికులు వెంకటమ్మ, నాగమ్మ మణెమ్మ,గౌసియా బేగం, శిరీష, భాగ్యలక్ష్మి, ఏఐటీయూసీ జిల్లా నాయకులు బాల పిరు,తదితరులు పాల్గొన్నారు,

## పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి

### - బిసి జాగృతి సేన మండల ప్రధాన కార్యదర్శి గొడుగు నర్సిములు



**జడ్చర్ల మేజర్ న్యూస్:** డిసెంబర్ 5 నుండి ప్రారంభమయ్యే శీతాకాల పార్లమెంట్ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం బిసి బిల్లు ప్రవేశపెట్టి చట్టసభలలో బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని బిసి జాగృతి సేన మండల ప్రధాన కార్యదర్శి గొడుగు నర్సిములు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మండలవిద్యా వనరుల కేంద్రం ఆవరణలో బీసీ జాగృతి సేన మండల నాయకుల సమావేశం నిర్వహించారు. బిసి జాగృతి సేన మండలప్రధాన కార్యదర్శి గొడుగు నర్సిములు మాట్లాడుతూ కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలన్నారు. జనవరి నుండి ప్రారంభమయ్యే దేశ జనాభా గణనలో బీసీల కులాల గణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్, మల్లెబోయినపల్లి గోపాల్, పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకటేష్, మండల సహాయ కార్యదర్శి చెన్నయ్య, సహాయ కార్యదర్శి కుర్వగడ్డపల్లి నాగేష్ పాల్గొన్నారు.

## జనాభా ప్రకారం ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించాలని వినతి



**పాలమూరు మేజర్ న్యూస్ :** జిల్లా కేంద్రంలో బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ కు శుక్రవారం జిల్లా కాంగ్రెస్ మైనార్టీ విభాగం చైర్మన్ మహమ్మద్ ఫయాజ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. జనాభా ప్రకారం ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ముల్ల, ముజవర్, సయ్యద్, పఠాన్, మొఘల్, అరబ్ లను బీసీ కేటగిరిలో చేర్చాలని కోరారు. అదే విధంగా వివిధ వృత్తిపనులు చేసుకునే ముస్లింలకు బీసీ వర్గాల్లో కులవృత్తులు చేసేవారికి ఇచ్చే సంక్షేమ ఫలాలు అందజేయాలని కోరారు. ముస్లింల చేసుకునే వారి వృత్తి పనుల ఆధారంగా ఇతురుల మాదిరిగా బీసీ రిజర్వేషన్ కల్పించాలని బీసీ కమిషన్ కు వచ్చిన వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు. బీసీ కమిషన్ కు వినతిపత్రం అందజేసిన వారిలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు ఫక్రుద్దీన్ ఖురేషి, మొయిజ్, ముజాహిద్, మహ్మద్ మజహర్, మహ్మద్ అబ్రార్ ఉన్నారు.

## భార్యను వేధించిన కేసులో భర్తకు జైలు శిక్ష

**అమరచింత, మేజర్ న్యూస్:** అమరచింత మునిసిపాలిటీలో భార్యకు వేధించిన కేసులో భర్తకు మూడేళ్ల జైలు శిక్షను ఆత్మకూరు కోర్టు ఇన్చార్జి జడ్జి వై. జానకి విధించినట్లు ఎస్సై బి. సురేష్ తెలిపారు. ఎస్సై సురేష్ కథనం ప్రకారం అమరచింతకు చెందిన బోయ రాధమ్మ తన భర్త మార్క కృష్ణమూర్తి సంసారం విషయంలో శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని 2017 సంవత్సరములో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అప్పట్లో ఉన్న ఎస్సై సత్యనారాయణ రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. జమీరుద్దీన్ హెడ్ కానిస్టేబుల్ కేసును ఇన్వెస్టిగేషన్ చేసి విచారించినట్లు తెలిపారు. కోర్టులో కేసును నమోదు చేశారు. నిందితునిపై చార్జి సీటు దాఖల్ చేసిన నేపథ్యంలో బుధవారం ఆత్మకూరు కోర్టులో ప్రభుత్వ లాయర్ అరుణోదయ కుమార్ బాధితుల తరఫున వాదోపవాదులు వినిపించిన అనంతరం న్యాయమూర్తి నిందితునికి మూడేళ్ల సాధారణ జైలు శిక్షను, 2000 రూపాయలు జరిమానను విధించడం జరిగిందని ఎస్సై సురేష్ విలేకరులకు తెలిపారు. ఇట్టి కేసులో ప్రభుత్వ లాయరు అరుణోదయ కుమారు బాధితుల తరఫున బలంగా వాదనలను వినిపించినందుకు నేరస్తునికి శిక్షపడే విధంగా కృషిచేసి నందులకు జిల్లా ఎస్పీ అభినందించారు. అదేవిధంగా సి డి ఓ. జి. బాలరాజు, ఎస్సై సురేష్ లను ఎస్పీ గిరిధర్ రావు అభినందించారు. బాధితులు ధైర్యంగా ముందుకు వచ్చి న్యాయం పొందగలరని ఎస్సై. సురేష్ కోరారు

## జర్నలిస్ట్ పై బెదిరింపులు మంచివి కాదు



**ధరూర్ మేజర్ న్యూస్ :** జోగులాంబ గద్వాల జిల్లా దళిత జర్నలిస్ట్ ఫోరం అధ్యక్షులు దాదే పోగు వెంకటన్న మాట్లాడుతూ నిన్న సాక్షి రిపోర్టర్ పై దాడులు రోజురోజుకు గద్వాల్ నియోజకవర్గంలో పెరుగుతున్న దళితులపై దాడులు గద్వాల్ నియోజకవర్గానికి చెందిన సాక్షి రిపోర్టర్ కిరణ్ కు ఫోన్ కాల్ ద్వారా బెదిరింపులకు పాల్పడడం మంచిది కాదు నిజాన్ని నిబ్బరంగా చూపించేది జర్నలిజం అందులో భాగంగానే ఇసుక అక్రమాలకు పాడుతున్నట్టు పేపర్లో రావడం పట్ల సాక్షి రిపోర్టర్ కిరణ్ జాగ్రత్తగా ఉండు ఒళ్ళు జాగ్రత్త పెట్టుకొని కొడకా అంటూ పై ఫోన్ కాల్స్ ద్వారా బెదిరింపులకు పాల్పడటం మంచిది కాదు బెదిరింపులు మానుకోవాలి దీని వెనక ఏ రాజకీయ నాయకుడు ఉన్నాడో దీన్ని పరిగణంలోకి పోలీసు డిపార్ట్మెంట్ పరిగణం లోకి తీసుకొని చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను కోరుతున్నాము ఈరోజు ఒక సాక్షి జర్నలిస్ట్ పై ఫోన్ కాల్ బెదిరింపులు మరి రేపు జిల్లాలో ఉన్న జర్నలిస్ట్ ల అందరిపై బెదిరింపు కాల్స్ రావని గ్యారెంటీ ఏంటి రేపటి రోజు గద్వాల్ జిల్లాలో ఉన్న జర్నలిస్టులు అందరి కూడా ఇలాంటి ఫోన్ కాల్స్ ద్వారా బెదిరింపులకు పాల్పడే అవకాశాలున్నాయి కాబట్టి ఇలాంటి బెదిరింపు కాల్స్ రాకుండా తగిన చర్యలు పై అధికారులు తీసుకోవాలని కోరుతున్నాం.

## పెండింగ్ జీతాలు ఇవ్వాలని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరిండెంట్ కు వినతి



**పాలమూరు మేజర్ న్యూస్:** ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని కోరుతూ తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియూసి)రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరిండర్ డాక్టర్ సంపత్ సింగ్ కు వినతిపత్రం ఇచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులమాదిరి గానే ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులకు కాంట్రాక్ట్ లేబర్ యాక్ట్ ప్రకారం ప్రతినెల ఏడవ తేదీ లోపు వేతనాలిచ్చేలా చూడాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో యూనియన్ నాయకులు,కార్మికులు వై.రంగన్న, అంజలయ్య, శ్రీను, గంగాధర్,నాగమణి,వరలక్ష్మి,యాదమ్మ మంజుల పాల్గొన్నారు.

## ఎంపీ మల్లు రవిని కలిసిన డిసిసి జనరల్ సెక్రెటరీ బంగ్లా రవీందర్ రెడ్డి



**నవాబుపేట మేజర్ న్యూస్:** మండల పరిధిలోని కారుకొండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు డిసిసి జనరల్ సెక్రెటరీ బంగ్లా రవీందర్ రెడ్డి (బంగ్లా రవి)నిన్న శుక్రవారం హైదరాబాదులో నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ ఎంపీ డాక్టర్ మల్లు రవినీ మర్యాదపూర్వకంగా కలిసి బొకే శాలువాతో సన్మానించడం జరిగిందని తెలిపారు.

## మెడికల్ పీజీ ప్రవేశ పరీక్షలో గిరిజన విద్యార్థి ప్రతిభ



**చారకొండ, మేజర్న్యూస్:** మండలంలోని శేరిఅప్పారెడ్డిపల్లి పంచాయతీలోని సోమ్ల తండాకు చెందిన కొర్ర నవిన్ చౌహన్ మేడ్చల్ జిల్లాలోని ఘన్పూర్ లో మెడిసిటి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. 2024 ఆగస్టు 11న మెడికల్ పీజీ ప్రవేశ పరీక్ష రాయడంతో ఈనెల 23న పలితాలు రావడంతో ఎస్టీ కేటగిరిలో 109 ర్యాంకు సాధించి చెన్నైలోని స్టాన్లీ మెడికల్ కాలేజిలో ఎండీ పీడియాట్రిక్లో సీటు సాధించడంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు, గ్రామస్థులు డాక్టర్ నవీన్ చౌహన్ ను అభినందించారు.

## వినాయక కాటన్ మిల్ లో జరిగిన షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిన ప్రమాదంలో 20 లక్షల ఆస్తి నష్టం



**తెలకపల్లి మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని చిన్న ముద్దునూరు సమీపంలో ఉన్న వినాయక కాటన్ మిల్లులో శుక్రవార%శీ% మధ్యాహ్నం జరిగిన షార్ట్ సర్క్యూట్ వల్ల పెద్ద ఎత్తున ఆస్తి నష్టం జరిగింది. దీనికి సంబంధించి మిల్లు యజమానులు ఈదులనరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మిల్లులో జరిగిన షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిన ప్రమాదంలో మిల్లులోని మిషనరీస్ దెబ్బతిన్నాయని వాటి విలువ దాదాపు 20 లక్షల వరకు ఉంటుందన్నారు. షార్ట్ సర్క్యూట్ జరగగానే అగ్నిమాపక సిబ్బంది సకాలంలో వచ్చి మంటలు ఆర్పడం వల్ల పెద్ద ప్రమాదం తప్పిపోయింది

## వ్యవసాయ మార్కెట్ కమిటీలో మండలంలో ఇద్దరికి చోటు




**చారకొండ: మేజర్ న్యూస్:** కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీలో శుక్రవారం చారకొండకు చెందిన పీఏసీఎస్ చైర్మన్ జెల్ల గురువయ్య గౌడ్, మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ నాయకుడు ముస్తఫముజ్జుబాయిలకు కల్వకుర్తి, అచ్చంపేట ఎమ్మెల్యేలు కత్తిరెడ్డి నారాయణరెడ్డి, డాక్టర్ చిక్కుడు వంశకృష్ణ ఆధ్వర్యంలో చోటు లభించింది. అవకాశం కల్పించిన కల్వకుర్తి, అచ్చంపేట ఎమ్మెల్యేలు కశిరెడ్డి నారాయణరెడ్డి, డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరావు, ఎంపి మల్లురవి, కాంగ్రెస్ పార్టీ నాయకులకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ కమిటీలో ఇద్దరికి చోటు కల్పించడంతో మండలంలోని పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## ఘనంగా దోరోళ్ల లక్ష్మమ్మ అమ్మవారి బోనాలు..

### - బోనాలు, చేపల వలలతో ఊరేగింపు బయలు దేరిన ముదిరాజులు..



**కోస్గి మేజర్ న్యూస్:** కోస్గి పట్టణంలో వెలసిన దోరోళ్ల లక్ష్మమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలు శుక్రవారం నాడు ఘనంగా నిర్వహించారు. పట్టణ ముదిరాజ్ లు,మహిళలు,చిన్నారులు,యువకులు పెద్దఎత్తున ఉత్సవాలలో పాల్గొన్నారు. .పట్టణం నడి బొడ్డున వెలసిన అమ్మవారి బోనాలు ప్రతి ఏడాది కార్తీక మాసంలో ముదిరాజ్ కులస్తులు అత్యంత పవిత్రంగా భావించి అమ్మవారి బోనాలు సమర్పిస్తారు. ముదిరాజ్ కులస్తుల వృత్తి చేపలు పట్టే వలలతో ఊరేగిస్తూ అమ్మవారి ఉత్సవాలు ఘనంగా జరుపుకుంటారు.పట్టణంలోని తెలుగు వీధి నుండి అమ్మవారి ఉత్సవ విగ్రహాలను,బోనాలను మరియు అలంకరించిన చేపల వలలను భక్తిశ్రద్ధలతో లక్ష్మమ్మ ఆలయానికి చేరుకుని బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. ఉత్సవాలలో ప్రత్యేక ఆకర్షణగా పోతురాజులతో బొడ్రాయికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం వారు చేసిన నృత్యాలు,ఆటలు ఆకట్టుకున్నాయి. ఊరేగింపులో పెద్దఎత్తున బాణసంచాలు కాల్చుతూ పట్టణ వీధులగుండా బోనాలు,చేపల వలలతో సందడి చేస్తూ,కోలాటాలు ఆడుతూ ఘనంగా సంబరాలు జరుపుకున్నారు.దోరోళ్ల లక్ష్మమ్మ ఉత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ మరియు ముదిరాజ్ సంఘం నాయకులు ఘనంగా ఏర్పాట్లు చేశారు .ఈ సందర్భంగా తుడుం శ్రీనివాస్,వలుపటి ఆనంతయ్య,మాస్టర్ శ్రీనివాస్,నరేష్, సందరిగారి వేణుగోపాల్, లక్ష్మయ్య, కుడుముల రాంచందర్, కోటగడ్డ వెంకటయ్య,టైటాన్ వెంకట్, చిన్నికృష్ణ, తదితరులున్నారు.

సూర్య
www.suryaa.com
శనివారం
23 నవంబరు 2024

## పీయూ అభివృద్ధికై ప్రణాళికలు సిద్ధం చేయండి

### - వీసీ ఆచార్య జిఎన్ శ్రీనివాస్

**మహబూబ్ నగర్ పియు మేజర్ న్యూస్ :** పాలమూరు యూనివర్సిటీ దీర్ఘకాలిక అభివృద్ధి అభివృద్ధిలో భాగంగా అకాడమిక్ ఆక్టివిటీస్ మరియు మౌలిక సదుపాయాల పై డీటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ సిద్ధం చేయాలని కమిటీని ఏర్పాటు చేస్తూ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ చైర్మన్‌గా డాక్టర్ అంకం భాస్కర్, కన్వీనర్ గా సూపరెండెంట్ రవీందర్ ను సభ్యులుగా డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ కే శ్రీధర్ రెడ్డి, డాక్టర్ వెంకట రాఘవేందర్ ,డాక్టర్ మధు , డాక్టర్ ఆంజనేయులు ,బలీక్ ఉద్దీన్ లను నియమించారు. శుక్రవారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసినా సమావేశంలో వీసీ శ్రీనివాస్ మాట్లాడుతూ, వచ్చే విద్యా సంవత్సరమునలా, ఇంజనీరింగ్ తరగతులు ప్రారంభం అవుతున్నందున విద్యార్థులకు అవసరమగు మౌలిక సదుపాయాలు, కంప్యూటర్ ల్యాబ్స్, రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ ల్యాబ్లు, స్పోర్ట్స్, బోధన బోధనేతర నియామకాలకు అవసరమగు అంశాలను అన్ని పొందుపరిచి డీటెయిల్ ప్రాజెక్టు రిపోర్టును అతి త్వరలో సమర్పించాలని అన్నారు. వీసీతోపాటు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ చెన్నప్ప పాల్గొన్నారు.

## అక్రమంగా అనుమతులు లేని కంకర తరలిస్తున్న టిప్పర్ ను మైయినింగ్ శాఖ అధికారులు పట్టివేత



**రేవల్లి మేజర్ న్యూస్ :** మండల పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా నడుస్తున్న పి.పి.ఆర్ కంపెనీ స్టోన్ క్రషర్ నుండి శుక్రవారం అక్రమంగా కంకర తరలిస్తుండగా మైయినింగ్ శాఖ అధికారులు పట్టుకొని స్థానిక రేవల్లి పోలీసులకు అప్పగించినట్లు ఎస్ఐ రాము తెలిపారు. మండలంలోని బండరాయిపాకుల గ్రామ చివరిలో ఉన్న పి.పి.ఆర్ క్రేషర్ నుండి %ూ 31ూా% 7799 నెంబర్ గల టిప్పర్, శుక్రవారం ఏటువంటి అనుమతులు లేకుండా కంకర ను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నప్పుడు మైనింగ్ శాఖ అధికారులు ఆ టిప్పర్ ను పోలీసుల సేఫ్ కస్టడీ కోసం స్థానిక స్టేషన్ లొ అప్పచెప్పడం జరిగిందని. పోలీసులు డ్రైవర్ ని అనుమతి పత్రాలు అడగగా చూపించకపోవడంతో టిప్పర్ ని పోలీస్ స్టేషన్ కి తరలించడం జరిగిందని ఎస్ఐ రాము తెలిపారు . పై అధికారుల నుండి రిలీజింగ్ ఆర్డర్ వస్తేనె , టిప్పర్లు విడుదల చేయబడుతుందని ఎస్ఐ రాము తెలిపారు.

## బీసీ రిజర్వేషన్స్ అమలుపై ప్రజాభిప్రాయ సేకరణ:బిసి కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్



**దామరగిద్ద మేజర్ న్యూస్ :** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో శుక్రవారం జరిగిన సమావేశంలో బిసి రిజర్వేషన్ స్అమలుపై ప్రజాభిప్రాయ సేకరణకు బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ మరియు కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న నారాయణపేట జిల్లా ఎంబీసీ సంచార కులాల సంఘం అధ్యక్షుడు జోగి రాజు మాట్లాడుతూ ు బి. సి. – ఏ" గ్రూపులో పాలకులు చాలా కులాలను చేర్చారు. అనంతరామన్ కమిషన్ నివేదికలోని బీసీ ఏ గ్రూపు యొక్క సూత్రీకరణ ప్రకారం – చేర్చిన కులాలను పరిశీలించి, క్రమబద్ధీకరణ చేయాలని కోరుతున్నాము.ముదిరాజు కులాన్ని బిసి– ఏ లో చేర్చవద్దు.బిసి రిజర్వేషన్స్ ను – ఏ, బి, సి, డి లాగా వర్గీకరణ చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలి.ఎంబిసి' కులాలుగా సంచార, అర్ధసంచార (సేవకులాలు) జాతులను కలిపి లెక్కించి – బిసి రిజర్వేషన్స్ పరిధిలోనే ఎంబీసీలకు రిజర్వేషన్స్ అమలు జరపాలి.బి సి చేతివృత్తుల కోపరేటివ్ సొసైటీలకు జిల్లా కో–ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ – డైరెక్టర్ల ఎన్నికల లో ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో నారాయణ పేట జిల్లా అధ్యక్షుడు జోగిరాజు ,%ఎ% మల్లప్ప ,దేవరకద్ర జోగి భాను ప్రసాద్ పాల్గొన్నారు.

## మండల విద్యాధికారి, ఇంచార్జీ ప్రధానోపాధ్యాయులపై సస్పెన్షన్ ఎత్తివేయాలి



**కృష్ణ మేజర్ న్యూస్ :** గత రెండు రోజుల క్రితం మాగనూరు జడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజన లోపానికి విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనలో మండలవిద్యాధికారి, ప్రధానోపాధ్యాయులు మురళీధర్ రెడ్డి,మధ్యాహ్న భోజనం ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు బాబు రెడ్డి లను సస్పెండ్ చేయడం అన్యాయమని వెంటనే సస్పెన్షన్ ఎత్తివేయాలని జిహెచ్ఎం గణేష్ సింగ్, ఉపాధ్యాయులు డిమాండ్ అన్నారు. శుక్రవారం మండలంలోని గుడేబల్లూర్ జెడ్పి పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిహెచ్ఎం మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం వికటించడంలో ఉన్నతాధికారులను, ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం అన్యాయమని మధ్యాహ్న భోజన బాధ్యతల నుంచి ఉపాధ్యాయులను తప్పించి విద్య బోధనకు పరిమితం చేయాలని కోరారు. వెంటనే సస్పెండ్ అయిన మండల విద్యాధికారి , ప్రధానోపాధ్యాయులు మురళీధర్ రెడ్డి, మధ్యాహ్నం భోజనం ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు బాబు రెడ్డి లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజనం పథకంలో అక్షయపాత్ర ఫౌండేషన్ కు బాధ్యతలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుమల రావు ,చంద్రశేఖర్ , ఆనంద ,రాజన్న ,నర్మద, శ్రీనివాసులు,అర్జున్ పాల్గొన్నారు.

## విద్యాధికారులు సస్పెన్షన్ ఎత్తివేయాలి



**నారాయణపేట జిల్లా ప్రతి నిధి మేజర్ న్యూస్ :** మధ్యాహ్న భోజన నిర్వహణలో నిర్లక్ష్యం వహించారు అంటూ జిల్లా విద్యాధికారి అబ్దుల్ గని మాగనూరు మండల మురళీధర్ రెడ్డి జెడ్ పి హెచ్ ఎస్ మాగనూరు ఇన్చార్జి హెడ్మాస్టర్ బాబు రెడ్డి లపై రాష్ట్ర ప్రభుత్వం విధించిన సస్పెన్షన్ను వెంటనే ఎత్తివేయాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ టి పి టి ఎఫ్ నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డప్ప డిమాండ్ చేశారు. జెడ్ పి హెచ్ ఎస్ క్యాతన్ పల్లి పాఠశాలలోమధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులపై సస్పెన్షన్ను ఎత్తివేయాలని ఉపాధ్యాయులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవస్థాగత లోపాలకు వ్యక్తులను బలి చేయడం సమంజసం కాదని పాఠశాలలకు నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయడంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు సకాలంలో బిల్లులు చెల్లించడంలో తీవ్ర అలసత్వం జరుగుతున్నదని ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులు విద్యా బోధన చేయాలో బోధనేతర మధ్యాహ్న భోజనవంట పనులు చేయాలో అర్థం కాని సందిగ్ధంలో ఉన్నారన్నారు. ఇలాంటి చర్యలు ఉపాధ్యాయ లోకాన్ని భయభ్రాంతులకు గురి చేయడం తప్ప లోపాలను సరి చేయడానికి పనికిరావు అన్నారు. సమస్య మూలాల్లోకి వెళ్లి లోపం ఎక్కడ జరిగిందో అధ్యయనం చేయాలన్నారు. మాగనూరు పాఠశాలలో జరిగిన సంఘటన విషాదమేనని దానికి పూర్తిగా బియ్యాన్ని సరఫరా చేసిన వారు వంట చేసేవారు బాధ్యత వహించాలన్నారు. వంట ఏజెన్సీ లపై పర్యవేక్షణకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని లేని పక్షంలో ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులు ప్రతిక్షణం భయపడుతూ తమ విధులను సక్రమంగా నిర్వహించలేరన్నారు. ఈ నిరసన కార్యక్రమంలోగెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ ఉపాధ్యాయులు వెంకటప్ప కనకప్ప దత్తాత్రి రవికుమార్ సునీత కవిత సంతోష్ కుమార్ బాలరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులపై సస్పెన్షన్ ఎత్తివేయాలి : నల్ల బ్యాడ్జీలతో తపస్ నిరసన



**మద్దూరు మేజర్ న్యూస్ :** గత రెండు రోజుల క్రితం మాగనూరు పాఠశాలలో మధ్యాహ్న భోజన లోపానికి ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం పట్ల తపస్ సభ్యులు నిరసన వ్యక్తం చేసింది. శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో జిల్లా పరిషత్ పాఠశాల పెదిరిపహాడ్ లో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు తపస్ మండల అధ్యక్షులు రవీందర్ నాయక్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాఠాలు చెప్పాలా, లేదా వంట చేయాలా అనే అయోమయ పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. సస్పెండ్ అయిన ఉపాధ్యాయులను వెంటనే విధుల్లోకి తీసుకోవలన్నారు, ఈ కార్యక్రమంలో తపస్ సభ్యులు గురునాథ్ రెడ్డి, కురుమయ్య, రవీందర్, ప్రకాష్, హరికృష్ణ, శబరి, శైలజ, శ్రీనివాసులు, రాజు, రాజారత్నం తదితరులు పాల్గొన్నారు

## ఉపాధ్యాయులపై సస్పెన్షన్ ఎత్తివేయాలి : నల్ల బ్యాడ్జీలతో తపస్ నిరసన



**మక్తల్ మేజర్ న్యూస్** మాగనూరు పాఠశాలలో మధ్యాహ్న భోజన లోపానికి ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం పట్ల తపస్ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో జరిగిన నిరసన కార్యక్రమంలో టి.పి.యు.యస్ మండల ప్రధాన కార్యదర్శి కె.రాకేష్ కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాఠాలు చెప్పాలా లేదా వంట చేయాలా అనే అయోమయ పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. మాగనూరు ఘటనకు బాధ్యులను చేస్తూ సస్పెండ్ చేసిన ఉపాధ్యాయులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని మధ్యాహ్న భోజన బాధ్యతల నుండి ఉపాధ్యాయులను పూర్తిగా మినహాయించాలని వారు డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన ఏర్పాట్లు అమ్మ ఆదర్శ కమిటీకి లేదా అక్షయపాత్రకు అప్పగించి ఉపాధ్యాయులను పూర్తిగా బోధన అంశాలకే వినియోగించుకోవాలని వారు విన్నవించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్ర శేఖర్, మాధవి, వెంకట్ రాములు, చంద్రకళ,పావని, మహేశ్వరి,ఉపాధ్యాయులు రాజ్ గోపాల్, నర్సిములు, ఆంజనేయులు, రాము, గోపాల్, శంకరయ్య, రాజంజనేయులు,రాము ,నరసింహ, గౌడ్,రవీందర్,జగదీష్,రామాంజనేయులు ,రాములు, నరసింహ, వెంకటయ్య, బాల్ రాజ్, ఆదం, వనజ, భారతి, మౌనిక తేజ, సౌమ్య, రమ్య, కల్పన, ప్రతిభ, సులోచన, నీలిమ, అనురాధ, వీణ, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 50 శాతం తగ్గకుండా రిజర్వేషన్లు అమలు చేయాలి

### -బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ సాగర్



**మహబూబ్ నగర్ మాజీర్ న్యూస్ :** ఎన్నో ఏళ్లుగా ఎదుచూస్తున్న సమగ్ర కుల గణన చేయటానికి ప్రభుత్వం ముందుకు రావడాన్ని బీసీ సమాజం మొత్తం అభినందిస్తు అదేవిధంగా 50% శాతం తగ్గకుండా రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ సాగర్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో తెలంగాణ బీసీ కమీషన్ అదర్వంలో నిర్వహించిన బహిరంగ చర్చలో మాట్లాడుతూ చాలా బీసీ కులాలు, యంబిసి కులాలు, ఉత్పత్తి కులాలు ఈరోజు వరకు విద్యపరంగా , రాజకీయపరంగా చాలా వెనుకబడి ఉన్నారని, రాజకీయ ప్రాధాన్యత లేని కులాలు చాలా ఉన్నాయని ప్రస్తుతం జరుగుతున్న కుల గణన ఆధారంగా వారికి చట్టసభలో కాలు మోపేందుకు అవకాశాలు కల్పించాలని కమిషన్ ద్వారా ప్రభుత్వాన్ని శ్రీనివాస్ సాగర్ కోరారు. కుల వృత్తిపై ఆధారపడి చాలా కులాలు ఉన్నాయని, ప్రభుత్వం బీసీకార్పొరేషన్ లకు ప్రత్యేక బడ్జెట్లను కేటాయించి ఆర్థికంగా ముందుకు పోయే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ఈడబ్ల్యూఎస్ పేరుతో ప్రభుత్వం అమలు చేస్తున్న విధానంలో ఈరోజు చాలామంది బీసీలు నిరుద్యోగులుగా మారడం జరిగిందన్నారు. బీసీల రిజర్వేషన్లను అగ్రవర్ణాల వాళ్ళు తీసుకెళ్తున్నారని అగ్రవర్ణాల వాళ్ళ లెక్క తేల్చి వాళ్లకు రిజర్వేషన్లు కల్పించి మిగిలిన శాతాన్ని బీసీలలో కలిపి విద్యా రాజకీయపరంగా, ఉద్యోగ పరంగా ముందుకు పోయే విధంగా కృషి చేయాలని ఆయన ప్రభుత్వాన్ని శ్రీనివాస్ సాగర్ కోరారు.

## 38,985 రూ. విలువ గల గుట్కా ప్యాకెట్ల పట్టివేత



**నారాయణపేట టౌన్ మేజర్ న్యూస్:** జిల్లా కేంద్రంలోని సరప్ బజార్ లోనీ అశోక్ అనే వ్యక్తికి చెందిన కిరాణా దుకాణంలో 38,985/- రూపాయల విలువ గల ప్రభుత్వ నిషేధిత అంబర్, జర్ధ గుట్కా ప్యాకెట్లను టాస్క్ ఫోర్స్, నారాయణపేట పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి గుట్కా ప్యాకెట్లను పట్టుకుని పోలీస్ స్టేషన్కు తరలించి అశోక్ పసరి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. నారాయణపేట పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా ప్రభుత్వ నిషేధిత గుట్కా ప్యాకెట్లను నిల్వ ఉంచిన, అమ్మిన, రవాణా చేసిన అట్టి వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ హెచ్చరించారు.

## అంగన్వాడీలో బట్టల పంపిణీ

### - అంగన్ వాడి టీచర్ యం ప్రియాంక



**మహమ్మదాబాద్ మెజర్ న్యూస్.** మండల కేంద్రంలోని అంగన్ వాడి సెంటర్ (2) లో బట్టల పంపిణీ చేసిన అంగన్ వాడి టీచర్ యం, ప్రియాంక, సిపిఎస్ హరిజనవాడ పాఠశాల హెడ్మాస్టర్ శోభారాణి, సరిత, కిరణ్మయి, ఈ సందర్భంగా అంగన్ వాడి టీచర్ మాట్లాడుతూ, మా పాఠశాల విద్యార్థులకు ఆట,పాట,లతో విద్య నేర్పిస్తామని అలాగే గుడ్డుతో కూడిన పౌష్టికాహారం మధ్యాహ్న భోజనం, అందిస్తామని విద్యార్థులకు సాయంత్రం పూట స్నాక్స్, (మురుకులు) అందిస్తామని విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులని ప్రతిరోజు పాఠశాలకు పంపించాలని అన్నారు, కాలానీలలో ఎవరైనా గర్భిణీ స్త్రీలు, బాలింతలు, ఉంటే మా పాఠశాలలో పేరు నమోదు చేయించుకోవాలని గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు గుడ్డుతో కూడిన పౌష్టికాహారం మధ్యాహ్న భోజనం అందిస్తామని,అన్నారు, కొంతమంది విద్యార్థులకు టి హెచ్ ఆర్ ద్వారా గుడ్లు, బాలామృతం పంపిణీ చేస్తామని అన్నారు, వివిధ కాలాన్నిలలో ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు మీ పిల్లలు రెండున్నర సంవత్సరాలు ఉంటే అంగన్వాడి సెంటర్లకు పంపించండి అంగన్ వాడి సెంటర్ల లో ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తూ పౌష్టికాహారం అందిస్తామని అన్నారు

## సమగ్ర కుటుంబ సర్వే డాటా ఎంట్రీ ప్రారంభం



**నవాబుపేట్ మేజర్ న్యూస్:** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే లో భాగంగా సేకరించిన వివరాలను డేటా ఎంట్రీ నమోదు నిన్న శుక్రవారం మండల పరిధిలోని ఎం.ఆర్.సి కార్యాలయంలో ప్రారంభమైంది, ఈకార్యక్రమంలో ఎంపీడీవో జయరాం నాయక్,తహసిల్దార్ శ్రీనివాస్, ఎంఈఓ నాగ్య నాయక్, సీఎంవో బాలు యాదవ్,సిఆర్పి జనార్ధన్, డాటా ఎంట్రీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రేపు కాంట్రాక్టు ఉద్యోగుల అత్యవసర సమావేశం

**మహబూబ్నగర్, మేజర్న్యూస్:** తెలంగాణ సమగ్ర శిక్ష అభియాన్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల అత్యవసర సమావేశాన్ని రాజీవ్ విద్యా విషయం మెట్టుగడ్డలో రేపు (ఆదివారం) ఉదయం 10 గంటలకు ఏర్పాటు చేస్తున్నట్లు కే శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. దీని ముఖ్య ఉద్దేశం ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో పిసిసి అధ్యక్షుడు ఉన్నప్పుడు సమ్మె చేస్తున్న సమయంలో వరంగల్ సమ్మెలో పాల్గొని వంద రోజుల లోపల మీ సమస్యలన్నీ, మినిమం టైమ్స్ స్కేలు ఇస్తామని హామీ ఇచ్చి సంవత్సరం కావస్తున్న ఇంతవరకు పరిష్కరించినందున ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇవ్వడానికి అందర్నీ సంసిద్ధం చేయడానికి ఈ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు కే శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి యాదగిరి తెలియజేశారు.

# అయ్యప్ప స్వామికి వావర్ కు సంబంధం ఏమిటి..?

### - వెంకన్న కాలంలో బీబీ నాంచారి.. - రామదాసు కాలంలో కబీర్ దాస్.. - అయ్యప్ప కాలంలో వావర్.

### - అస్సలు వీరంతా ఎవరు వీరికి సనాతన ధర్మంతో ఉన్న సంబంధం ఏమిటి...? - శివానంద స్వామీ..



**నారాయణపేట మేజర్ న్యూస్:** అయ్యప్ప స్వామి చరిత్రలో వావర్ ఎవరు ? ముస్లిమా? హిందువా? భారతీయుడా? విదేశీయుడా..? ఆధారాలు లేని చరిత్ర ప్రకారంగా మరియు చలనచిత్ర పరంగా వావర్ ఒక ముస్లిం వ్యక్తి. అయితే సనాతన ధర్మ, పురాణాల ప్రకారం అయ్యప్ప స్వామి శ్రీమహావిష్ణు దశ అవతారాలలో ఒకటైన మోహిని శివుడికి జన్మించిన స్వామియే అయ్యప్ప. స్వామి అయ్యప్ప కలియుగంలో ధర్మ సంస్థాపనకి, మనిషి మర్ధనకై అవతరించిన ధర్మశాస్త్ర అవతారంగా భావిస్తారని శివనంద స్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయ్యప్ప స్వామి జీవించిన కాలం 11వ శతాబ్దం. ఈ శతాబ్దంలో భారత దేశంలో రాజపుత్రలో ఢిల్లీలో గులాం వంశస్థులు మరికొన్ని ప్రాంతాల్లో చోళ పాండ్య మలయాళ రాజవంశాలు స్వామి వారు ప్రధానమైన అంశాలు తెలుపూ....

**వావర్ స్వామీ ఎవరు..?** వావర్ యొక్క చరిత్రకు ఆధారాలు లేవు. కొన్ని కథనాల ప్రకారం వావరు సౌదీ అరేబియా నుండి మలయాళ ప్రాంతానికి వలస వచ్చి స్థిరపడి ఒక గజదొంగగా మారాడని ఆ యొక్క దోపిడి వ్యవస్థలో స్వామి అయ్యప్పతో యుద్ధం చేశాడని యుద్ధంలో ఓడిపోయాడని స్వామి మహిమను తెలుసుకొని స్వామికి స్నేహితుడిగా మారాడని చలనచిత్ర రంగం ద్వారా తెలుస్తూ ఉన్నది. కానీ వీటిపై ఎటువంటి ఆధారాలు లేవు. సనాతన ధర్మంపై జరిగే దాడులలో ఇది కూడా ఒక రకమైన దాడి. స్వామి అయ్యప్ప అవతారం కలియుగంలో 11వ శతాబ్దం అప్పటికి ఇస్లాం అనేది ప్రారంభం కాలేదు. అలాగే భక్త రామదాసు పుట్టింది 1620లో, కబీర్దాస్ పుట్టింది 1398 లో.. అటువంటి రామదాసు కబీర్ దాసు స్నేహితులుగా పరిగణించింది ఈ యొక్క చలనచిత్ర రంగం. 11వ శతాబ్దంలో జరిగిన అయ్యప్ప స్వామి అవతారానికి 17వ శతాబ్దంలో వచ్చిన ఇస్లాం వ్యవస్థకు సంబంధం లేదు. అయ్యప్ప దీక్ష నియమాల ప్రకారం శవం ఎదురు వస్తే స్నానం చేసి సన్నిధానాన్ని చేరే అయ్యప్ప స్వాములు సమాధికి నమస్కరించడం అనేది వ్యతిరేకం. కాబట్టి ఇకనుండి శబరిమల వెళ్ళే స్వాములు ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామిని దర్శించుకుందాము స్వామి అనుగ్రహాన్ని పొందుదాం అని అన్నారు.

## మతమార్పిడిలు తగవు ఇదే హిందూ ధర్మ సందేశం : హిందూ చైతన్య రథయాత్ర



**ధరూర్ మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలో ధర్మ జాగరణ తెలంగాణ హిందూ చైతన్య రథయాత్ర మండల కేంద్రంలో మరియు మండల పరిధిలో హిందూ చైతన్య రథయాత్ర నిర్వహించారు ప్రపంచంలో ఇతర మతాలు ఒకే ప్రవక్త సందేహాలపై ఆధారపడ్డాయి. భగవద్ దర్శనం కొరకు సృష్టి రహస్యాలు తెలుసుకోవడం కొరకు వేల సంవత్సరాల క్రితమే వందల మంది అన్ని వర్గాల చెందిన స్త్రీ పురుషులు మార్షలు తపస్సు చేసి కనుగొన్న రహస్యాలు వేదమంత్రాలు. భగవంతుని దర్శించిన ఋషులు ఎందరో ఇతరుల మతాల విశ్వాసం ప్రకారం ఒక ప్రవక్త దేవుని కుమారుడు కాక మరొక మత ప్రవక్త దేవుని వాక్యములను విన్నాడు తపస్సు చేసి భగవత్ సాక్ష్యమును పొందిన ఋషులు యోగులు సాధకులు ప్రాచిన కాలంలో కాక ఆదిశంకరాళ్లు రామానుజులు గురునానకు సంతు రవిదాస్ మీరాబాయి తులసీదాసు సుర దాస్ చైతన్య మహాప్రభు రామకృష్ణ పరామహంస రమణ మహర్షి అరవిందుడు అన్నమయ్య వేంగమాంబ వంటి ఋషుల అనేకమంది ఆధునిక కాలంలోనే భారతదేశంలో కనిపిస్తారు ధర్మ రక్షణకు నరసింహనిగా శ్రీరామునిగా శ్రీకృష్ణునిగా బుద్ధునిగా భగవంతుడే జన్మించి నడయాడిన పుణ్యభూమి భారతదేశం స్త్రీని గౌరవిద్దాం పూజిద్దాం ఇతర మతాలలో స్త్రీని దేవతగా పూజించడం కనబడదు హిందూ ధర్మం ప్రకృతి సృష్టికి మూలం ఆదిశక్తిగా తెలపబడింది ఎక్కడ స్త్రీలు గౌరవింపబడతారో అక్కడే దేవతలు నివసిస్తారు అంటారు హిందూ ధర్మం చెబుతుంది ప్రపంచంలో అనేక మతాలు ఉన్నాయి మతాల మధ్య యుద్ధాలు అవసరం లేదు మతమార్పిడి దృశ్యం మతమార్పిడిలు తగవు ఇదే హిందూ ధర్మం సందేహం హిందూ ధర్మం గొప్పతనం మంచిని ఎక్కడ నుంచైనా స్వీకరించే పట్టు విడుపులు ధోరణి కుటుంబ వ్యవస్థ పకృతిలో అంతట భగవంతుని దర్శించే ఏకత్వం మనం చేసే మంచి చెడు పనులకు బట్టే మనకు మంచి చెడులు జరుగుతాయని కర్మ సిద్ధాంతం మానవ శాంతియుత జీవనానికి అవసరమైన చతుర్విధ పురుషార్థాలు ధర్మాత్మ కామ మోక్ష వ్యవస్థ ఇలా ఎన్నో అంశాలు హిందూ ధర్మ విశిష్టతలు. హెచ్చరిక మాయ మాటలకు మోసపోకండి అడుగడుగునా జాగ్రత్తగా ఉండండి.

## పి.ఆర్.టి. యు.టి.ఎస్ మండల అధ్యక్షులుగా నేపాల్ , ప్రధాన కార్యదర్శి గా సాయి చరణ్ ఏకగ్రీవంగా ఎన్నిక.



**చిన్న చింతకుంట మేజర్ న్యూస్ :** చిన్న చింతకుంట మండలం పిఆర్టియు టీ ఎస్ సర్వ సభ్య సమావేశం శుక్రవారం జడ్.పి.హెచ్.ఎస్ లాల్ కోట నందు సూర్మి రాఘవేందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షులుగా నేపాల్ ప్రధాన కార్యదర్శి గా సాయి చరణ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా అధ్యక్షులు శ్రీ మదన్ మోహన్ యాదవ్ మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యల సాధనలో రాష్ట్రంలోనే బలమైన సంఘం పిఆర్టియు సంఘం అని, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ హక్కులు- బాధ్యతలు గుర్తెరిగి, సమస్యా పరిష్కారం లో ఉపాధ్యాయ పక్షపాతిగా సంఘం పని చేస్తుందని అని తెలిపారు. ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించిన రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు అశ్విని చంద్రశేఖర్ సురేష్ రెడ్డి , పత్రికా సంపాదక వర్గ సభ్యులు అత్తార్ అహ్మద్ ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులచే ప్రమాణ స్వీకారంలి చేయించారు. ప్రత్యేక అతిథులుగా విచ్చేసిన మండల విద్యాధికారి పి మురళీ కృష్ణ మాట్లాడుతూ,జిల్లాలోనే మండలంలోని పాఠశాలలకు అవసరమైన త్రాగునీరు, కాంపౌండ్ వాల్స్ , అదనపు తరగతి గదులు వంటి సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వ నిధుల కేటాయింపులో మండలానికి మొదటి ప్రాధాన్యత ఇచ్చే విధంగా పి ఆర్ టి యు జిల్లా సంఘం కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ నీరటి , మండల అసోసియేట్ అధ్యక్షులు రాజ శేఖర్, గిరిజన సంఘం ప్రధాన కార్యదర్శి గంగయ్య , శ్రీనివాస్ , ఎం పద్మజ , సావిత్రమ్మ , సృజన , ఈశ్వరయ్య రాఘవేందర్ , కుమార స్వామి , లక్ష్మీ , సూర్యకళ , పద్మలత , సుమన , రోహిణి ,నౌసిన్ బేగం , నవీన , సిద్దార్థ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## కుల గణన నిష్పక్షపాతంగా చేపట్టాలి : బిసి ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులు



**నారాయణపేట జిల్లా ప్రతినిధి మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కుల గణన ను నిష్పక్షాతంగా ప్రకటించాలని బిసి ఐక్య వేదిక రాష్ట్ర కార్యదర్శి రామాంజనే యులు బిసి కమిషన్ ను కోరారు. బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారంఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా అధ్యక్షులు.కుమ్మరి రాజు. ఉమ్మడి జిల్లాకార్యదర్శి. ఎం.లింగం గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ బీసీ కమిషన్ బృందం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు వచ్చినశుభ సందర్భంగా. బిసి కులగణన పలు రకాల తో కూడిన బీసీల అంశాలపై. బీసీ ఐక్యవేదిక వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు.మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ ఆఫీసులో ఏర్పాటు చేసిన సమావేశంలోతెలంగాణ ప్రభుత్వం బీసీ కులగణన ప్రక్రియలో భాగంగా తెలంగాణ రాష్ట్ర కమిషన్ చైర్మన్ పోగుశెట్టి నిరంజన్ బృందానికి గత కెసిఆర్ ప్రభుత్వంలో జరిగిన కుటుంబ సర్వేను దాచిపె ట్టి.ఇప్పుడు రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నటు వంటి కులాగణను కులాల వారిగా నిష్పక్షపాతంగా బహిరంగంగా. ప్రకటన చేయాలి. అలా చేయని యెడల కాంగ్రెస్ ప్రభుత్వంపై బీసీలకు జరిగిన అన్యయ్యని వివరించి బీసీలను చైతన్యపరిచి. కాంగ్రెస్ ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్తామని వారు వివరిం చారు.2024 స్థానిక సంస్థల ఎన్నికల్లో. బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాల ని వారు తెలంగాణ బీసీ కమిషన్ బృందానికి విజ్ఞప్తి చేశారు

## పేట డిఈఓగా గోవిందరాజులు

**నారాయణ పేటజిల్లా ప్రతినిధి మేజర్‌న్యూస్:** నారాయణపేట జిల్లా విద్యాధికారిగా గోవింద రాజులు ఎఫ్ఆసిగా నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వెంకట నర్సింహారెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.జిల్లా లోని మాగనూర్ ఉన్నత పాఠశాల లో ఫుడ్ పాయిజన్ అయి విద్యార్థులు అస్వస్థతకు గురి అయిన సంఘటనలో సస్పెండ్ అయిన డి ఈ ఓ ఎం ఏ.గని స్థానంలో గోవింద రాజులు ను నియమించారు.

## నాగర్‌కర్నూలు జిల్లాఇంటర్మీడియట్ నోడల్ అధికారి అమ్రాబాద్ జూనియర్ కాలేజ్ ఆకస్మిక తనిఖీ



**అమ్రాబాద్ మేజర్ న్యూస్** :ప్రభుత్వ జూనియర్ కళాశాల అమ్రాబాద్ ఈరోజు నాగర్ కర్నూల్ జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి శ్రీ జి. వెంకటరమణ కళాశాలను ఆకస్మిక తనిఖీ చేసి విద్యార్థుల హాజరును మరియు వార్షిక పరీక్షలకు సన్నద్ధత గురించి తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నోడల్ అధికారి మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు హాజరవుతూ ఉత్తీర్ణతా శాతాన్ని పెంచాలని క్రమశిక్షణతో మెలగాలని విద్యార్థులకు సూచించారు ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ప్రిన్సిపల్ ప్రభు వర్ధన్ రెడ్డి మరియు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు

## నూతన డీఈఓకు స్వాగతం పలికిన టీఎస్‌యుటిఎఫ్

### -ఉపాధ్యాయ సమస్యల వినతి పత్రం అందజేత



**పాలమూరు మేజర్ న్యూస్:** నూతనంగా డీఈఓ గా బాధ్యతలు స్వీకరించిన ఏ ప్రవీణ్ కుమార్ను తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్( టీఎస్‌యుటిఎఫ్) నేతలు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించి చర్చించారు. ఇటీవల జరిగిన బదిలీలలో ఎస్‌జిటి, స్కూల్ అసిస్టెంట్ స్పౌస్ అవకతవకలపై చర్యలు తీసుకోవాలని, అక్రమ డిప్యూటేషన్లను రద్దు చేయాలని, పండితుల పొరపాట్లను సరిదిద్దాలని, అప్గ్రేడ్ అయిన స్కూల్ అసిస్టెంట్ తెలుగు పోస్టులను ప్రభుత్వ మేనేజ్మెంట్ నుండి లోకల్ బాడీ మేనేజ్మెంట్ కు మార్పు చేయాలని, పాలన వ్యవస్థను అవినీతి అక్రమాలు లేకుండా చక్కదిద్దాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఎన్.వెంకటేష్, కే.రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షులు పి ఉమాదేవి, కోశాధికారి వీ భాస్కర్, జిల్లా కార్యదర్శులు శివరాజ్, అజయ్, సుదర్శన్, హేమంత్, నాయకులు జావేద్ రాములు,అత్తర్ హుస్సేన్, శంకర్ నాయక్, రాములు శివకుమార్, శంకరయ్య పాల్గొన్నారు.

## పౌష్టిక ఆహారంతో పాటు మెరుగైన విద్యనందించాలి

### - జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు



**గద్వాల ప్రతినిధి, మేజర్ న్యూస్:** విద్యార్థులకు పౌష్టిక ఆహారంతో పాటు మెరుగైన విద్యాను అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు ఆదేశించారు. శుక్రవారం గద్వాల పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ పాఠశాలలో అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి సూచించారు. అలాగే తరగతి గదులను పరిశీలించి విద్యార్థులకు మెరుగైన వసతులు అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. తరగతుల నిర్వహణలో ఉన్న లోటుపాట్లను సరిదిద్దాలని, పాఠశాల పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన ఆదేశించారు. విద్యార్థుల హాజరును పెంపొందించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు ఇమాన్యుల్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల్లో రాణిస్తే స్పోర్ట్స్ కోటలో ఉద్యోగాలు

### - ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి



**మక్తల్ మేజర్ న్యూస్** క్రీడల్లో రాణిస్తే స్పోర్ట్స్ కోటలో ఉద్యోగాల్లో వస్తాయని ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు.మండల పరిధిలోని కర్ని గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పిడి బి.రూప ఇంచార్జ్ ఆధ్వర్యంలో ఈ నెల 13 నుండి 22 వరకు పది రోజులపాటు జరిగిన శిక్షణ శిబిరానికి, శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరై, క్రీడాకారులను పరిచయం చేసుకొని ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు పది రోజులపాటు కర్ని మారుమూల గ్రామంలో శిక్షణ పొందడం చాలా ఆనందంగా ఉందని ,మీకు శిక్షణ ఇచ్చిన కోచ్ లు బీ.రూప, రంజిత్,సతీష్ అభినందిస్తూ, జాతీయ స్థాయిలో రాణించి మెడల్స్ తీసుకురావాలని, మీకు అన్ని విధాలుగా సహాయ సహకారం అందిస్తానని 80,000 వేలు విలువచేసే 40 మంది క్రీడాకారులకు క్రీడా దుస్తులు, షూస్, ప్లేయింగ్ కిట్స్ అందజేశారు. మీరందరూ జాతీయ స్థాయిలో రాణిస్తే స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు లభిస్తాయని ఉన్నత చదువుల కొరకు సర్టిఫికెట్స్ ఉపయోగపడతాయని ఎమ్మెల్యే తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎక్స్ ఎంపీపీ చంద్రకాంత్ గౌడ్ ,కోళ్ల వెంకటేష్, గణేష్, గ్రామ మాజీ సర్పంచులు రవీందర్ గౌడ్, అక్రమ్, నర్సింలు, కట్ట సురేష్ గ్రామ పెద్దలు తెలంగాణ రాష్ట్ర కోకో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి ,ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి విలియం శిక్షణ శిబిరం ఇంచార్జ్ బీ.రూప, రంజిత్, సతీష్ ,శ్రీనివాసులు వెంకటేష్ , చక్రవర్తి, బాలరాజ్, జిహెచ్ఎం వెంకటయ్య గౌడ్, ఉపాధ్యాయులు ఎల్లప్ప ,నరేష్, శిరీష ఉపాధ్యాయ బృందము విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం పైన విషం చిమ్మే ప్రయత్నం చేస్తున్నారు

### - ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**మహబూబ్‌నగర్ మేజర్‌న్యూస్ :** ప్రభుత్వం పైన విషం చిమ్మే ప్రయత్నం చేస్తున్నారని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా చిన్న పిల్లలవార్డులో చికిత్స పొందుతున్న మాగనూరు హాస్టల్ విద్యార్థులను ఆయన పరామర్శించారు. వైద్యులను అడిగి వారి ఆరోగ్య పరిస్థితిని, మరియు వారికి అందిస్తున్న చికిత్స గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. కిచెన్‌ను వంట సామాగ్రిని ఆయన పరిశీలించారు అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత రెండు రోజులు క్రితం మాగనూరుకు చెందిన హాస్టల్ విద్యార్థులు అక్కడ హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ వల్ల ఆసుపత్రిలో చేరడం జరిగిందని, విద్యార్థులకు అందించిన అల్పాహారంలో ఏవో పురుగులు వచ్చాయని కొందరు కావాలని ఆసుపత్రికి వచ్చి ఆందోళన చేశారు. వెంటనే జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ ఇతర అధికారులు ఆసుపత్రికి వచ్చి క్షుణ్ణంగా పరిశీలించారు. అధికారులు పూర్తిగా కిచెన్‌ను, భోజనానికి వినియోగించే వస్తువులను బియ్యం, పప్పులు అన్నింటినీ పరిశీలించడం జరిగిందని, ఆసుపత్రిలో రోగులందరికీ ఇక్కడ నుంచే ఆహారం అందిస్తుంటే కేవలం ఒకే ఒక్క విద్యార్థికి మాత్రమే పురుగులు రావడం జరిగింది అని, దానిపైన పూర్తిగా విచారణ చేస్తామని, ఒకవేళ అధికారుల తప్పిదం ఉంటే చర్యలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. ఇద్దరు తప్ప మిగతా అందరూ కూడా పూర్తి ఆరోగ్యవంతులుగా రిపోర్ట్స్ రావడంతో వారిని పంపించారని, మిగిలిన ఇద్దరికి కూడా మంచి వైద్యం డాక్టర్లు అందిస్తున్నారని వారికి కూడా ఎలాంటి అపాయం లేదని రిపోర్టు వచ్చాక వారిని కూడా డిస్చార్జ్ చేస్తామని ఆయన చెప్పారు. ఎమ్మెల్యేతో పాటు ఆసుపత్రి డెవలప్మెంట్ కమిటీ సభ్యులు బెజ్జుగం రాఘవేంధర్, సాదుల్లా ,గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, కౌన్సిలర్ ఖాజా పాష, నాయకులు ప్రవీణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

# బైపాస్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

### - సామాన్య ప్రజలకు ఆటంకం జరగకుండా చూస్తాం పూరపాలక చైర్మన్ ఆనంద్ గౌడ్



**మహబూబ్ నగర్ టౌన్ మేజర్ న్యూస్:** స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్ మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని 31వ వార్డు, వీరన్నపేటపక్కనుంచి వెళుతున్నటువంటి బైపాస్ రోడ్డు ఇరువైపులా ఇండ్లు ఉండడంతో రాకపోకలకు ఆటంకం కలుగుతుందని స్థానికులు కౌన్సిలర్ మొహసిన్ కి సమస్యలు తెలియజేయడంతో మహబూబ్ నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం సంబంధిత ప్రాంతాలను పరిశీలించి న్యాయమైనది ఉన్నది, కాబట్టి అతి త్వరలో సంబంధించిన కాంట్రాక్టర్లతో మాట్లాడి వీలైనంత త్వరలో అండర్ గ్రౌండ్ బ్రిడ్జి ప్రారంభించేలా చూస్తానని హామీ ఇచ్చిన హామీ ఇచ్చారు. పరిశీలనలో స్థానిక కౌన్సిలర్ మొహసిన్, ముధ చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ , సిరాజ్ ఖాద్రి ఇతర పెద్దలు స్థానికులు పాల్గొన్నారు.

## శ్రీ కురుమూర్తి స్వామి హుండీ లెక్కింపు

### : రూ.22.78 లక్షలు హుండీ ఆదాయం



**చిన్నచింతకుంట, మేజర్‌న్యూస్ :** కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా జిల్లా నలు మూలల నుంచే కాకుండా పట్టణ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తజనం స్వామివారిని దర్శించుకున్న అనంతరం మొక్కుల రూపేనా స్వామి వారి హుండీలో వేసిన నగదును శుక్రవారం లెక్కించారు. ఆలయ ఈవో మదనేశ్వర్ రెడ్డి, చైర్మన్ గౌని గోవర్ధన్ రెడ్డి, ఆలయ ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్ సమక్షంలో హుండీ లో వేసిన నగదును లెక్కించగా రూ.22 లక్షల 78 వేల 896 ఆదాయం రావడం జరిగిందని వారు తెలిపారు.ఈనెల 12న మొదటి హుండీ ని లెక్కించగా 25 లక్షల 54 వేల 895 రావడం జరిగింది. ఈ రెండు హుండీల నగదును కలపగా రూ.48 లక్షల 33 వేల 791 ఆదాయం రావడం జరిగిందని వారు తెలిపారు.ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు భాస్కరాచారి, భారతమ్మ, కమలాకర్ ,శ్రీధర్ రెడ్డి, ఉంద్యాల శేఖర్, గోపాల్ చక్రవర్ధన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, బాదం వెంకటేశ్వర్లు, రాములు, భక్తులు వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి ,ఆలయ అర్చకులు నంబి వెంకటయ్య,సత్యనారాయణవీరితోపాటుమహిళాసేవకులు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను

సంచలన దినపత్రికగా పేరొందిన నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
లో పనిచేసేందుకు ఆసక్తి కలిగిన విద్యావంతులకు, విలేకరులకు

మహబూబ్‌నగర్ జిల్లా : హన్వాడ, కౌకుంట్ల, మూసాపేట, అడ్డాకుల, భూత్పూర్
గద్వాల జిల్లా : ఉండవెల్లి, కేటిదొడ్డి, గట్టు, రాజోలి, మల్దకల్, ఇటిక్యాల, వడ్డేపల్లి, మానోపాడు
నారాయణపేట జిల్లా : నారాయణపేట ప్రతినిధి, రూరల్, ఊట్కూర్, గుండుమాల్

ఏరియాల్లో అవకాశం కల్పిస్తోంది.

సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును.

ఆసక్తి కలిగిన వారు సంప్రదించాల్సిన నెంబరు
8008622757